నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
ప్రకాశం | బాపట్ల
శుక్రవారం 18 ఏప్రిల్ 2025 | పేజీలు 8

## ఢిల్లీలో సీఎం చంద్రబాబు ముందస్తు జన్మదిన వేడుకలు

### పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపిన ఎంపి మాగుంట



ఒంగోలు, మేజర్‌న్యూస్ : ఈ నెల 20వ తేదీన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు 75వ జన్మదినోత్సవం సందర్భంగా విదేశీ పర్యటనలో భాగంగా గురువారం ఢిల్లీ చేరుకున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రిని ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి పుట్టినరోజు కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఎంపి మాగుంటతో పాటు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, ఇతర పార్లమెంట్ సభ్యులు ఉన్నారు.

## ప్రజలకు సమృద్ధిగా తాగునీరు అందజేయాలి

### అవసరమైన చోట్ల ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయాలి

### జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్ : తాగునీటి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని ఎంత మాత్రమూ సహించబోనని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఆర్.డబ్ల్యు.ఎస్ అధికారులతో గురువారం ప్రకాశం భవనంలో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించి జిల్లాలో తాగునీరు సరఫరా అవుతున్న తీరుపై సమీక్షించారు. వచ్చే మూడు నెలలు అప్రమత్తంగా ఉండాలని అధికారులను, సిబ్బందిని ఆమె ఆదేశించారు. అవసరమైన ఇతర శాఖలతో సమన్వయం చేసుకొని క్షేత్రస్థాయి సమస్యలను పరిష్కరించాలని చెప్పారు. అవసరమైన మోటార్ల మరమ్మతులు, విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ల మరమ్మతులు తక్షణమే చేపట్టాలని ఆదేశించారు. ఆయా విషయాల్లో ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలని సూచించారు. స్థానికంగా ఉన్న రక్షిత మంచినీటి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, అవసరం లేని చోట ట్యాంకర్ల ద్వారా సరఫరా చేసినట్లు తన దృష్టికి వస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా వివరాలను ప్రభుత్వం నిర్దేశించినట్లుగా ప్రత్యేక యాప్‌లో మాత్రమే నమోదు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్. ఎస్.ఈ బాల శంకరరావు, పబ్లిక్ హెల్త్ ఈ.ఈ శ్రీనివాస సంజయ్, మున్సిపల్ కమిషనర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈలు, డి.ఈ.ఈలు, ఏఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## 19న 'ఈ-చెక్' ఇతివృత్తంతో పరిసరాల పరిశుభ్రత

### కార్యాలయాల్లో ఈ-వ్యర్థాల రీసైక్లింగ్‌పై అవగాహన కల్పించాలి

### జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం

ఒంగోలు, మేజర్‌న్యూస్: 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ నెలలో 'ఈ - చెక్' ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా చెప్పారు. ప్రతినెలా మూడో శనివారం ప్రత్యేక ఇతివృత్తంతో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న నేపథ్యంలో ఈ నెల 19న చేపట్టే కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులతో గురువారం ప్రకాశం భవనంలో కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలలోనూ, ప్రజల వద్ద ఉన్న ఈ-వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే విధానం, నిర్వహణపై అవగాహన కల్పించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రీసైక్లింగ్ కేంద్రాలకు వీటిని తరలించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో డిఆర్ఓ బి. చిన ఓబులేసు, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి


### పశువులకు నీటి తొట్టెల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి

### వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఆదేశం





ఒంగోలు, మేజర్‌న్యూస్ : వేసవి కాలంలో జిల్లాల్లో ఎక్కడా ప్రజలకు త్రాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్, జిల్లా కలెక్టర్లకు సూచించారు. గురువారం ఉదయం విజయవాడ ఏపీ సచివాలయంలోని సి.ఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వర్చువల్‌గా సమావేశమై ఉచిత ఇసుక సరఫరా, సోలార్ ప్రాజెక్టులకు భూసేకరణ, సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల ఫిల్లింగ్ యాక్షన్ ప్లాన్, త్రాగునీటి సరఫరా, సానుకూల ప్రజా అవగాహన, ఎంఎస్ఎమ్ఈల సర్వే, నియోజక వర్గాలలో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటు, స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర తదితర అంశాలపై సమీక్షించారు. ఒంగోలు కలెక్టరేట్ నుండి జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకరరావు, ఇరిగేషన్ ఎస్ఈ వరలక్ష్మి, డిపిఓ వెంకటనాయుడు, మైన్స్ డిడి రాజశేఖర్, సిపిడిసిఎల్ ఎస్ఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మాట్లాడుతూ వేసవి కాలంలో జిల్లాల్లో ఎక్కడా ప్రజలకు త్రాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల కలెక్టర్లు తగిన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించుకొని ముందస్తుగా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వేసవిలో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను వనరుల ద్వారా పూర్తిగా నింపుకోవాలని సూచించారు. నీటి రవాణా అవసరమైన ప్రాంతాలలో ఏదైనా సమస్య వస్తే వెంటనే స్పందించి పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. పశువులకు నీటి తొట్టెల నిర్మాణాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలో ఈనెల 19న మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఈ మాసంలో 'ఎలక్ట్రానిక్ వ్యర్థాల రీసైక్లింగ్' అంశంతో పారిశుద్ధ కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం సూచించిందని అందుకనుగుణంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి నియోజక వర్గంలో ఎంఎస్ఎమ్ఈ పార్కు ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.






ఢిల్లీలోని పార్లమెంట్ భవన్ కమిటీ హాలులో గురువారం గృహ, పట్టణ వ్యవహారాల కమిటీ సమావేశంలో పలు అంశాలపై సమీక్షించిన కమిటీ ఛైర్మన్, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి.

సూర్య
www.suryaa.com
PRAKASAM ప్రకాశం BAPATLA బాపట్ల

# పరిశ్రమల స్థాపనకు వనరులు సమకూర్చాలి: కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: పరిశ్రమల స్థాపనకు అన్ని వనరులు, అనుమతులు సమకూర్చాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. పరిశ్రమల ప్రోత్సాహక జిల్లాస్థాయి కమిటీ సమావేశం గురువారం స్థానిక కలెక్టరేట్లో జరిగింది. పరిశ్రమలతో ఉత్పాదకత, ఉపాధి అవకాశాలు, ఆదాయ వనరులు పెరుగుతాయని జిల్లా కలెక్టర్ చెప్పారు. పరిశ్రమలు స్థాపించడానికి ముందుకువచ్చే ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహించాల న్నారు. అవసరమైన వనరులు సమకూర్చడం, అనుమ తులకు సహకరించాలన్నారు. అధికారులు సమన్వ యంతో పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పలు సూచన లు చేశారు. పరిశ్రమల స్థాపనకు ఇటీవల సింగిల్ డెస్క్ విధానంలో 189 దరఖాస్తులురాగా, అందులో 171 దరఖాస్తులు అనుమతులు పొందాయన్నారు. పి ఎం ఈ జిపి పథకం కింద 56 యూనిట్లు స్థాపిం చాలని లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలి పారు. రూ.1.53 కోట్ల నిధులతో యూనిట్ల స్థాపన లక్ష్యం కాగా 65 యూనిట్లను ఇప్పటికే ప్రారంభిం చినట్లు చెప్పారు. లక్ష్యానికి మించి రుణాలు ఇచ్చామని, రూ.2.13 కోట్ల నిధులు వెచ్చించినట్లు తెలిపారు. పీఎం విశ్వకర్మ పథకానికి జిల్లా నుంచి 38 వేల 446 దరఖాస్తులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించిన 4,765 దరఖాస్తులను కేంద్రా నికి పంపామన్నారు. 2,916 దరఖాస్తులకు అను మతులు లభించాయన్నారు. గతంలో పరిశ్రమల స్థాపించి మనుగడ సాగిస్తున్న 41 మంది లబ్ధిదా రులకు వివిధ పథకాల కింద రూ.3.0 కోట్ల నిధు లు రాయితీ కల్పించాలని ప్రతిపాదిస్తూ జిల్లా కలెక్టర్ ఆమోద ముద్ర వేశారు. జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, కమిటీ కన్వీనర్ జిల్లా పరిశ్రమల శాఖ అధికారి వై రామకృష్ణ, అనుబంధ శాఖల జిల్లా అధికారులు, ఫ్యాప్సి కార్యదర్శి భక్తవత్సలం పాల్గొన్నారు.

## గర్భిణీలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలి



చుండూరు(భట్టిప్రోలు)మేజర్‌న్యూస్: గర్భిణీ స్త్రీలు మంచి పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతంగా ఉంటారని అంగన్వాడి సూపర్వైజర్ పి నాగరాజుకుమారి తెలియజేశారు.గురువారం మండలంలోని చినపరిమి గ్రామంలో పోషక పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు ఎప్పటికప్పుడు వైద్యశాలను సందర్శించి వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలకు మాతా శిశువులకు పోషకాలతో కూడిన పౌష్టికారాన్ని అందిస్తున్నామని వివరించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రం ద్వారా గర్భిణీలకు బాలింతలకు పౌష్టికాహారాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,గర్భిణీలు, బాలింతలు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నాటుసారా నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్



బాపట్ల రూరల్, మేజర్‌న్యూస్: నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా బాపట్ల అసిస్టెంట్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరిండెంట్ బి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బాపట్ల మండలం బేతపూడి, స్టువర్టుపురం గ్రామాలలో నాటు సారా నిర్మూలనకు గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. నాటు సారాయి కేసులలో ముద్దాయిలుగా ఉన్నటువంటి వారి ఇళ్లకు వెళ్ళి వారికి కౌన్సెలింగ్ ద్వారా అవగాహన కల్పించి నాటు సారాయి తయారీ, అమ్మకం, రవాణా వంటి చర్యలకు పాల్పడినట్లయితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించి నవోదయం 2.0 పాంప్లేట్ లను వారికి అందజేశారు. బాపట్ల ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ పి గీతిక, బాపట్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ, వెదుళ్ళపల్లి సబ్ ఇన్స్పెక్టర్ పి. భాగ్యరాజు, బాపట్ల ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్లు దేవరకొండ.ప్రభుదాస్, ఎస్.మౌనిక, స్టూవర్టుపురం వీఆర్వో విజయలక్ష్మి, బేతపూడి వీఆర్వో వలి, సిబ్బంది పాల్గొన్నారు.

## హైస్కూల్ విద్యార్థులకు సైకిళ్ళు పంపిణీ



వేమూరు(భట్టిప్రోలు)మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన వేమూరు గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు పిల్లి మనోజ్- సంధ్యారాణి ల కుమార్తె లారాస మొదటి జన్మదినాన్ని పురస్కరించుకొని వేమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేరే గ్రామాల నుంచి వచ్చి చదువుకుంటున్న విద్యార్థులకు గురువారం ఉచితంగా సైకిళ్ళు అందించారు.రూ 50 వేల వ్యయంతో బలిజేపల్లి, చంపాడు,రావికంపాడు, బెతేలిపురం లకు చెందిన పదిమంది విద్యార్థులకు దాతల తరఫున పిల్లి ఆంజనేయ ప్రసాద్,దేవరపల్లి డేవిడ్ రాజ్ చేతుల మీదుగా ఉచితంగా సైకిళ్లు అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాతల సహకారాన్ని అందిపుచ్చుకొని చదువులో రాణిం చాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో పిల్లి శేఖర్,దాసు తదితరులున్నారు.

## సమతుల్య ఆహారంతో ఆరోగ్యం పదిలం: సిడిపిఓ



కొల్లూరు, మేజర్‌న్యూస్: గర్భిణీలు బాలింతలు సమతుల ఆహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యం పదిలంగా ఉంటుందని అమృతలూరు ప్రాజెక్ట్ ఐసిడిఎస్ అధికారిని గన్నవరం విజయలక్ష్మి అన్నారు. బుధవారం దోనెపూడి ఆలపాటి నగర్ అంగన్వాడి కేంద్రంలో సూపర్వైజర్ ఫజరున్నిసా ఆధ్వర్యంలో జరిగిన పోషకాహార పక్షోత్సవాల కార్యక్రమంలో విజయలక్ష్మి పాల్గొన్నారు.

## ప్రజలు ఎందుకు తిరస్కరించారో ఆత్మపరిశీలన చేసుకోండి



బాపట్ల, మేజర్‌న్యూస్: గడచిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పార్టీని ప్రజలు ఎందుకు తిరస్కరించారో ఆత్మ పరిశీలన చేసుకోవాలని అన్నారు బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు. బాపట్ల పట్టణం తెదేపా కార్యాలయంలో టీటీడీ దేవస్థానం నిర్వహిస్తున్న గోశాల లో ఆవులు మృతి చెందాయి అంటూ అసత్య ప్రచారం చేస్తున్న వైఎస్ఆర్సిపి నాయకుడు భూమన కరుణాకర్ రెడ్డి పై తెదేపా నాయకులు మండిపడ్డారు. ఈ సందర్భంగా బావుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు మాట్లాడుతూ భూమన కరుణాకర్ రెడ్డి టీటీడీలో మరణించిన ఆవుల సంఖ్యను గూర్చి అబూత కల్పనలో అసత్య ప్రచారం చేస్తూ మత కుల రంగులో అంటగడుతూ దుర్మార్గమైన ప్రయత్నం చేస్తున్నారని, నాస్తికుడును అని ప్రకటించుకున్న భూమన కరుణాకర్ రెడ్డిని వైఎస్ఆర్సిపి ప్రభుత్వం టిటిడి చైర్మన్ గ నియమించడం పాపంగా భావిస్తున్న అన్నారు. కార్యక్రమంలో తెదేపా పట్టణ అధ్యక్షుడు గోలపల శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ లీడర్ దయా బాబు, ఆంధ్రేయ, శీలం శ్రీనివా సరావు, తదితర తెదేపా నాయకులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై తెదేపా ఎస్సీ వర్గీయుల హర్షం



అద్దంకి, మేజర్‌న్యూస్: ఎస్సీ వర్గీకరణ పట్ల కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి తెదేపా ఎస్సీ విభాగం నేతలు హర్షం వ్యక్తం చేశారు. పట్టణంలోని పోతురాజుగండి వద్ద గల తెదేపా కార్యాలయం నందు జరిగిన విలేకరుల సమావేశంలో నియోజకవర్గ ఎస్సీ విభాగం అధ్యక్షులు వలపర్ల సుబ్బారావు మాట్లాడుతూ సమాజంలో అన్యాయానికి గురికాబడిన సామాజిక వర్గానికి చేయూత అందించేలా వర్గీకరణ అంశం ఉపకరిస్తుందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం వలన 59 ఎస్సీ కూలలకు ప్రయోజనం చేకూరిందన్నారు.ఈ రిజర్వేషన్లు త్వరలో విడుదల చేస్తున్న మెగా డీఎస్సీ ఉపాధ్యాయ పోస్టుల నుండే అమలు జరిగేలా ఆంధ్ర రాష్ట్రంలో ఆర్డినెన్స్ తీసుకురావటంపై టిడిపి ఎస్సీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కొరిశపాడు, బల్లికురవ ఎస్సీ విభాగం అధ్యక్షులు మందా నాగేశ్వర రావు, వేల్పుల అబ్రహం, పూనూరి నరేంద్ర, కత్తి అశోక్, సీనియర్ నేత ఎంజే స్టాలిన్, నెహేమియా, పసుమర్తి సామ్యేలు, రాజశేఖర్, పీసీహెచ్ కోటయ్య తదితరులు ఉన్నారు.

## రూ.20 లక్షలతో వాటర్ ట్యాంక్ నిర్మాణం




వేమూరు(భట్టిప్రోలు) మేజర్‌న్యూస్: తాగునీటి అవసరాల దృష్ట్యా చావలి గ్రామంలో 20 లక్షల రూపాయల వ్యయంతో రెండో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి కార్యాచరణ జరుగుతుందని గ్రామ సర్పంచ్ విష్ణుమొలకల శ్రీనివాస రావు తెలిపారు. గురువారం గ్రామపంచాయతీ వద్ద జరిగిన గ్రామసభ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గతంలో వాటర్ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం జరిగిందని, తాగునీటి అవసరాలకు సరిపోకపోవడం,గ్రామంలో కొంత భాగం పైప్ లైన్ లు కూడా లేనందున రెండో ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం కొరకు కార్యాచరణ రూపొందించామన్నారు. అందుకు సంబంధించి ట్యాంక్ నిర్మాణం కోసం శాసనసభ్యులు నక్కా ఆనంద బాబు రూ 20 లక్షల గ్రాంట్ మంజూరు చేఇంచ యటం జరిగిందని,అందుకు సంబంధించి త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. గ్రామస్తులు గ్రామాభివృద్ధికి సహకారాన్ని అందించాలని, వివాదాలు విడనాడి గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు సహకరించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యాలయ సిబ్బంది,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## రాణించిన బాలికలకు ప్రోత్సాహం

బాపట్ల, మేజర్‌న్యూస్: ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ఎస్ ఎం జి జూనియర్ కళాశాల విద్యార్థునులకు సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకాలు గురువారం అందజేశారు. ఈ విద్యార్థును లు జీవితంలో రాణించి, ఉన్నత స్థానాలు అలంకరించాలని వ్యవస్థాపకుల ఆశయాల సాధనకు కృషి చేయాలని ప్రిన్సి పాల్ జి. దుర్గాప్రసాదరావు కోరారు.వ్యవస్థాపకులు వెలగపూడి సుబ్బారావు, సరస్వతమ్మల పేరిటమెడల్స్‌ను కూడా అందజేశారు. కళాశాల అభివృద్ధి కమిటీ కార్యదర్శి డాక్టర్ పి సి సాయిబాబు మాట్లాడుతూ దాతల త్యాగ నిరతిని విద్యార్థునులు అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. అధ్యాప కులు సతీష్ బాబు,ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సారారహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి



నగరం, మేజర్‌న్యూస్ : సారా ప్రభావిత ప్రాంతాలను సారా రహిత గ్రామాలుగా త్వరితగతిన తీర్చిదిద్దాలని రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ అసిస్టెంట్ కమిషనర్ ఎం. సుధాకర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం రాష్ట్ర ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు నవోదయం 2.0 లో భాగంగా స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేసి మాట్లాడుతూ సారా నిర్మూలన కార్యక్రమాన్ని సఫలీకృతం చేసేందుకు నిరంతరం సిబ్బంది బాధ్యతగా ఉండాలన్నారు. ఈ ప్రాంతంలో నవోదయ 2.0 కార్యక్ర మం ఎలా జరుతుంంటూ ఆరా తీశారు. నాటుసారా తయారీ నిర్మూలనకు తీసికోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిఐ మార్టూరి శ్రీరామ్ ప్ర ఓసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎ. విజయలక్ష్మి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా వినుకొండ మమత



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా వినుకొండ మమత నియమితులయ్యారు. ముండ్లపాడు గ్రామంలో నివాసం ఉంటున్న వినుకొండ మమత ఇటీవల కూటమి ప్రభుత్వం నామినేట్ పదవుల భర్తీకి శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా మమతకు పదవి దక్కడంపై ఆమె ఆనందం వ్యక్తం చేస్తుంది. ఈ అవకాశం ఇచ్చిన కూటమి ప్రభుత్వానికి స్థానిక ఎమ్మెల్యే అశోక్ రెడ్డికి వినుకొండ మమతతో పాటు ఆమె భర్త వినుకొండ చిన్న కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

# ఇక్కడ బడ్డీ దుకాణాల్లో మద్యం దొరకును!!

## టిడిపి నేతల కనుసన్నలో నిర్వహణ - ప్రోత్సహిస్తున్న వ్యాపారులు

## ఇష్టానుసారంగా బెల్టుషాపుల ఏర్పాటు - నియంత్రణలో వైఫల్యం

పామూరు, మేజర్‌న్యూస్: ప్రభుత్వ మద్యం దుకాణాలు పోయి ప్రైవేట్ వైన్‌షాపులు వచ్చేసాయి. కావలసిన బ్రాండ్లు కొనుక్కోవచ్చు తాగొచ్చు. అయితే ఎక్కడో వైన్స్‌కు వెళ్లి కొనుక్కునేందుకు ఇబ్బంది పడకుండా అందుబాటులో కూడా మద్యం దొరికే సౌలభ్యం పామూరు మండల పరిధిలో ఉంది. ఇంటి నుంచి బయటకు వచ్చే సమీపంలోనే బడ్డీ కొట్టుకు వెళితే మందు దొరుకుతుండడంతో మందుబాబులు ఖుషిఖుషీగా ఉంటున్నారు. ఆదాయం అధికంగా ఉండటంతో బెల్ట్ నిర్వహణకు పలువురు పోటీపడుతున్నారు. టిడిపి నేతల కన్నుసన్నల్లో బెల్ట్‌షాప్‌ల నిర్వహణకు ముందుకు వస్తున్నారు. బెల్ట్ షాపుల్లో 24 గంటల మద్యం అమ్మకాలు జోరుగా జరుగుతున్నాయి. బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు విచ్చలవిడిగా సాగుతున్నాయి. టిడిపి నేతల కన్ను సన్నుల్లో



గ్రామాల్లో మద్యం ఏరులై పారుతుంది. ఎన్నడు లేని విధంగా గ్రామాల్లో ప్రతి బడ్డీ దుకాణాల్లో మద్యం ఏరులై పారుతుంది. మద్యం సేవించి రాత్రుల యందు గ్రామాలలో అలజడి రేగుతుంది. బెల్ట్ షాపులను నియంత్రించవలసిన అధికారులు పట్టీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అమ్మేవారు కూడా తాము అధికారులను ప్రసనం చేసుకొని విక్రయాలు జరుపుతున్నామని చెబుతుండడం విశేషం. ఎక్సైజ్ అధికారులకు మామూలు అందుతుడడంతో బెల్ట్ షాపులను నియంత్రించడం లేదనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మండల పరిధిలోని గ్రామాలలో బెల్ట్‌షాపుల నియంత్రణకు కృషి చేయాలని పలువురు గ్రామాల ప్రజలు క ోరుతున్నారు.

## పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలంటే..

శరీరంలో ప్రతి అవయవం ఆరోగ్యంగా ఉంటేనే పూర్తి ఆరోగ్యం బాగుంటుంది. ముఖ్యంగా శరీరంలో పేగు ఆరోగ్యం ఎంతో కీలక పాత్ర పోషిస్తుంది. పేగులో ఎన్నో లక్షల సూక్ష్మజీవులు ఉంటాయి. ఎప్పుడైతే వీటి పనితీరు బాగుంటుందో, జీర్ణక్రియ, పోషకాల శోషణ మెరుగ్గా ఉంటాయి. అంతేకాకుండా మానసిక ఆరోగ్యం కూడా దీని పై ఆధారపడి ఉంటుంది. కనుక ఈ సూక్ష్మజీవుల మధ్య ఎంతో ఆరోగ్యకరమైన సంబంధం ఉండాలి. అయితే దానికోసం కొన్ని రకాల ఆహార పదార్థాలను చేర్చుకోవాలి. ఇలా చెయ్యడం వలన చెడు బ్యాక్టీరియాకు సంబంధించిన సమతుల్యం సరైన విధంగా ఉంటుంది. మీ డైట్‌లో భాగంగా ఈ సూపర్ ఫుడ్స్‌ను చేర్చుకోవడం వలన ఆహారంలోని మైక్రోబయోమ్ ను తిరిగి నింపుతాయి. కనుక వీటిని కచ్చితంగా తీసుకోవాల్సిందే. పేగు ఆరోగ్యానికి పెరుగు ఎంతో సహాయం చేస్తుంది అని చెప్పవచ్చు. పెరుగుని మజ్జిగగా తీసుకోవచ్చు లేక పండ్లతో పాటుగా తినవచ్చు. పెరుగును తీసుకోవడం వలన జీర్ణక్రియ మెరుగుపడుతుంది. అంతేకాకుండా ప్రోబయోటిక్స్ కూడా పుష్కలంగా అందుతాయి. ముఖ్యంగా ఉబ్బరం వంటి జీర్ణ ప్రక్రియకు సంబంధించిన సమస్యలు తగ్గిపోతాయి. కనుక ప్రతిరోజు భోజనం చేసిన తర్వాత ఒక గ్లాస్ మజ్జిగ తీసుకోవడం వలన చాలా ఉపయోగం ఉంటుంది మరియు పేగు ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. జీర్ణవ్యవస్థకు ఉసిరి ఎంతో సహాయం చేస్తుంది. దీనిలో ఫైబర్, విటమిన్ సి చాలా ఎక్కువగా ఉంటాయి. అంతేకాకుండా రోగనిరోధక శక్తిని పెంచడానికి కూడా సహాయం చేస్తుంది. చాలా శాతం మంది నెయ్యిని తీసుకుంటే బరువు పెరిగిపోతారని అనుకుంటారు. కానీ ప్రతిరోజు తక్కువ మోతాదులో నెయ్యిను తీసుకోవడం వలన జీర్ణక్రియకు ఎంతో సహాయం చేస్తుంది. పైగా పేగుల ఆరోగ్యానికి ప్రతిరోజు ఒక చెంచా నెయ్యి తీసుకోవడం ఎంతో అవసరం. పేగుల ఆరోగ్యానికి పెసరపప్పు ఎంతో మేలు చేస్తుంది. పైగా ఇది ఎంతో త్వరగా జీర్ణం అవుతుంది. కనుక మీ ఆహారంలో భాగంగా ఈ ఆహార పదార్థాలను కచ్చితంగా తీసుకోండి.

## పాస్టర్‌లకు కూటమి సర్కారు శుభవార్త: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి



దర్శి, మేజర్‌న్యూస్: గుడ్ ఫ్రైడే ముందురోజు పాస్టర్లకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ అందించినట్టు దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. 8,427 మంది పాస్టర్లకు నెలకు రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం విడుదలకు సీఎం చంద్రబాబు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని పేర్కొన్నారు. 2024 మే నుంచి నవంబర్ వరకు ఈ గౌరవ వేతనం విడుదల చేసినట్టు వెల్లడించారు. ఏడు నెలల కాలానికి గాను రూ.30 కోట్లు కూటమి ప్రభుత్వం వ విడుదల చేసినట్టు తెలిపారు. 7 నెలలకు గాను ఒకొక్క పాస్టరుకు రూ.35,000 చొప్పున లబ్ధి పొందనున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ క్రైస్తవులకు తీపి కబురు అందించారని గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

## పౌష్టికాహారంతోనే ఆరోగ్యం: ఆర్‌జెడి జయలక్ష్మి



దర్శి, మేజర్‌న్యూస్: అధికారులు పనితీరు సక్రమంగా లేకపోతే శాఖ పరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఐసిడిఎస్ ఆర్.జె.డి జయలక్ష్మి అన్నారు. పౌష్టికాహార పక్షోత్స వాల సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దర్శి ఎంపీడీవో కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆర్‌జెడి మాట్లాడుతూ పౌష్టికాహారం ప్రాముఖ్యత, మాతృశిశు పోషణ, బాలల ఆరోగ్య అభివృద్ధి, పోషక ఆహార వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రజల్లో పోషక ఆహారంపై చైతన్యం తీసుకురావడం, ఆరోగ్యవంతమైన జీవనశైలిని ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. ప్రాథమిక విద్య ప్రదర్శన స్టాల్, చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాల ప్రదర్శన స్టాల్ ను అంగన్వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేశారు. అనంతరం వెలుగోటి దుర్గ భవాని కుమార్తెకు ఆర్‌జెడి జయలక్ష్మి అన్నప్రసన చేశారు, చిరుధాన్యాలతో వంటకాలు చేసిన నలుగురికి అంగన్వాడి కార్యకర్తలకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి దర్శి మండలం రాజంపల్లి గ్రామానికి చెందిన అంగన్వాడి టీచర్ నరసమ్మకు, ద్వితీయ బహుమతి దర్శి పట్టణం ఏకలవ్య నగర్ సెక్టార్ చెందిన రమ రాగ, తృతీయ బహుమతి విరా యిపాలెం గ్రామం సెక్టార్కు చెందిన విజయ, నాలుగో బహుమతి గంగపాలెం సెక్టార్కు చెందిన వెంకటరమణకు దక్కింది. ఈ కార్యక్రమలో దర్శి ఎంపీపీ జి సుధారాణి, మున్సిపల్ కమిషనర్ మహేష్ ,ఎంపీడీవో కృష్ణమూర్తి,సి. డి.పి.ఓ సిహెచ్ భారతి ఎంఈఓ1 కే రఘురామయ్య, ఎంఈఓ 2 రమాదేవి, ఏపిఎం రజియా, మెడికల్ ఆఫీసర్లు బ్లేస్సి,కాశీ చేతన్, ఐటీసీ ప్రథమ్ జిల్లా కోఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు, దర్శి ఐసిడిఎస్ సూపర్వైజర్లు కే.అనురాధ, జి.జ్యోతి,.సుభాషిని, బి.సునీత లు పాల్గొని మాట్లాడారు.

## స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ



బాపట్ల, మేజర్‌న్యూస్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహిస్తున్న పోషణ్ పక్వాడలో భాగంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఐసిడిఎస్ ప్రాజెక్టు స్థాయిలో సిడిపిఓ ఎన్.లక్ష్మీపార్వతి ఆధ్వర్యంలో ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెయ్యి రోజుల సంరక్షణ గురించి నియోజకవర్గంలోని అంగన్వాడీ కార్యకర్తలకు గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పించారు. చిరుధాన్యాలతో కూడిన 20 రకాల వంటకాలు ఆహార ప్రదర్శనగా ఉంచారు. ముగ్గురు గర్భిణీకు తహసీల్దార్ షేక్.సలీమా చేతులమీదుగా శ్రీమంతాలు చేశారు. ఆరు నెలల పిల్లలకు అన్నపాసన, మూడేళ్ల పిల్లలకు బాపట్ల మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి చేతుల మీదుగా అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు కె.శేషుకుమారి, జి.జ్యోతి, పి.త్రివేణి, ఎ.అరుణకుమారి, కె.కుమారి, ఎం.మల్లీశ్వరి, వి రాధ, ఎన్.పద్మావతి, కే జే యస్.సౌజన్య, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



## టిబి వ్యాధిపై అవగాహనతో వైద్యం పొందాలి

### ప్రభుత్వ వైద్యకళాశాల అధ్యాపక, సిబ్బందికి పరీక్షలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఒంగోలు ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికల్ కాలేజీ బోధన, బోధనేతన సిబ్బందికి సి.వై.టి.బి స్కిన్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వేడుకొండలరావు ఆధ్వర్యంలో సిబ్బందికి అందరికి సి.వై టి.బి స్కిన్ టెస్ట్ చేశారు. క్షయవ్యాధి ఒక వృత్తిపరమైన వ్యాధిగా అభివృద్ధి చెందే ప్రమాదం ఉందన్నారు. రోగులకు ఇంకా చికిత్స అందించకపోతే లేదా చికిత్స అసమర్థంగా ఉంటే ప్రమాదం ఉంది. టీబీతో సంబంధం లేకుండా, ఆరోగ్య-సంరక్షణ సెట్టింగ్‌లలో టీబీ నుండి టీబీ హెల్త్ కార్ వర్కస్‌లకు ప్రసారం చేయడం ప్రపంచంలోని దాదాపు ప్రతి దేశం నుండి నివేదించబడింది. భారతదేశం నుండి జరిపిన అధ్యయనాలు కూడా ఆరోగ్య కార్యకర్తలలో టి.బి సంభవం గణనీయంగా ఎక్కువగా ఉన్నట్లు చూపించాయి. ప్రతి ఫ్రంట్ లైన్ వర్కర్స్ విధిగా పరీక్ష చేసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా. వెంకటేశ్వరావు సూచించారు. భారత దేశాన్ని టిబి రహిత దేశంగా నిర్మించాలన్న ఉద్దేశ్యంతోనే ప్రతీ ఒక్కరూ ఈ పరీక్ష చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రములో డిప్యూటి సూపరిండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్, ఆర్ఎంవో డాక్టర్ మాధవీలత, డాక్టర్ ఎస్.పి.యమ్ హెచ్ఓడి, డా. తిరుమలరావు, పాలమానాలజీ హెచ్‌వోడి డా. రంజిత్ భాష, పి. సాంబశివరావు, ఎస్.రత్నాకుమారి టి.బి. జిల్లా కోర్డినేటర్, సురేష్ బాబు, కోటేశ్వరావు, కాలేషాబాబు, జయరామిరెడ్డి, డి. శ్రీనివాసులు పాల్గొన్నారు.



## ఉద్యాన పంటల సాగులో జాగ్రత్తలు తీసుకోవాలి

సి.ఎస్.పురం, మేజర్‌న్యూస్: మండలంలో ఉద్యాన పంటలు మామిడి, దానిమ్మ, బత్తాయి, జామ తదితర పంటలు వేసిన రైతులు వేసవి తీవ్రత దృష్ట్యా తగుజాగ్రత్తలు తీసుకోవాలని మండల ఉద్యానవన అధికారిణి కుసుమ సూచించారు. గురువారం మండలంలోని పెదగోగులపల్లె గ్రామంలో మామిడి, బత్తాయి తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మామిడి పంటలో తామరపురుగు, తేనెమంచు పురుగు అధికంగా ఉన్నట్లు వెంటనే క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలని సంబంధిత మందులను సూచించారు. అదేవిధంగా బత్తాయి పంటలో తెగుళ్ల నివారణకు తగుజాగ్రత్తలు తీసుకోవాలని పంటల సంరక్షణకు మెళకువల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉద్యాన అధికారిణి కుసుమ, పలువురు రైతులు పాల్గొన్నారు.

## నదిలో మునిగి ఇద్దరు యువకులు మృతి

భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండల పరిధిలోని వేమవరం గ్రామానికి చెందిన ఇరువురు యువకులు కృష్ణా నదిలో ఈతకు వెళ్లి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది.రేపల్లె పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రేపల్లె మండలం పెనుమూడి సమీపంలోని కృష్ణా నదిలో స్నానం చేసేందుకు దిగిన ఆరుగురు యువకుల్లో ఇద్దరు మృతి చెందినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. గురువారం మధ్యాహ్నం కృష్ణా నదిలో దిగి స్నానం చేస్తూ ఉండగా ప్రమాదవశాత్తు నీటి ఉధృతికి ఆరుగురు కొట్టుకొని పోతూ ఉండగా నలుగురిని గ్రామస్తులు కాపాడి ఒడ్డుకు చేర్చారు. ఇరువురు మృతి చెందారు. మృతులు భట్టిప్రోలు మండలం సూరేపల్లి శివారు వేమవరం గ్రామానికి చెందిన పెనుమాల దేవదాసు(19), తలకాయల గౌతమ్(18)లుగా గుర్తించి రేపల్లె ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉంచినట్లు సిఐ తెలిపారు. మరో ఇద్దరు యువకులు రేపల్లెలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు.





సూర్య www.suryaa.com



# సౌర విద్యుత్తు ప్రాజెక్టులకు భూసేకరణ చేపట్టాలి: కలెక్టర్



బాపట్ల, మేజర్‌న్యూస్: జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో త్రాగునీటి సరఫరా, పరిశ్రమలకు భూసేకరణ,ఇసుక రవాణా,స్వచ్ఛ ఆంధ్ర, పరిశ్రమల స్థాపన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సోలార్ ప్రాజెక్టుల నిర్మాణాలకోసం చీరాల, రేపల్లె డివిజన్ ల్లో భూసేకరణ చేపట్టాలన్నారు. రుతుపవనాలు రాకముందు ప్రజలకు ఇసుక కొరత లేకుండా ముందస్తుగా లక్ష టన్నుల ఇసుకను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా నుండి ఇతర రాష్ట్రాల కు ఇసుక అక్రమ రవాణా జరగకుండా చెక్ పోస్టులు,నిఘా కెమె రాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. జిల్లాలో ప్రస్తుతం గాజులంక -1 ఇసుక రీచ్ నుండి ఇసుక సరఫరా జరుగుతుంద న్నారు. గాజులంక -2 ఇసుక రీచ్ త్వరలో ప్రారంభించడము జరుగుతుందన్నారు. జువ్వలదిన్నే ఇసుక రీచ్ ను ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏజెన్సీ ద్వారా త్వరలో ప్రారంభిస్తారన్నారు. జిల్లాలో త్రాగునీటి ఇబ్బందులు లేకుండా కృష్ణ పశ్చిమ కాలువల ద్వారా త్రాగునీటి ట్యాంకులకు నీరు నింపుకోవాలని అధికారులు ఆదేశం చారు. బాపట్ల పట్టణానికి త్రాగునీరు అందించే రక్షిత మంచినీటి పథకానికి కృష్ణ పశ్చిమ కాలువ ద్వారా నీటిని నింపుకోవాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. జిల్లాలో జరిగిన ఎం.ఎస్. ఎం.ఇ సర్వే రివాల్యుయేషన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, గనులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్,జిల్లా సరఫరాల శాఖ అధికారి విల్లియమ్స్, బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి.గ్లోరియా, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్, రేపల్లె రెవెన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను తొలగించాలి

రేపల్లె, మేజర్‌న్యూస్: విద్యార్థులు తమ గృహాలలో పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను సక్రమమైన మార్గంలో డికంపోజ్ చేయాలనీ ఏ బి ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టీసీ రవిచంద్ర కుమార్ సూచించారు. గురువారం స్థానిక శ్రీ ఏ. బి. ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రేపల్లెలో స్వచ్ఛ ఆంధ్ర- స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థ్యాలు-నిర్వహణ" అనే అంశం మీద విద్యార్థిని విద్యార్థులకు అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు తమ గృహాలలో పనికిరాని ఎలక్ట్రానిక్ వస్తువులను సక్రమమైన మార్గంలో డికంపోజ్ చేయాలనీ కోరారు. ఈకార్యక్రమానికి ముఖ్య వ్యక్తగా విచ్చేసిన డాక్టర్ వి వి రవీంద్ర మాట్లాడుతూ విద్యార్థులు వాడే సెల్ ఫోను టీ.వి, పనికి రాని వీటిని సక్రమమైన మార్గంలో తమ ఇంటి నుండి తొలగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ-ఆంధ్ర కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. దాసు, సభ్యులు డాక్టర్ ఎమ్ బుజ్జి బాబు, కె. బాలగురవయ్యా, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

## గొట్టిపాటి లక్ష్మి చొరవతో సమస్యకు పరిష్కారం





దర్శి, మేజర్‌న్యూస్: ఏళ్ళ తరబడి పరిస్కారం కాని సమస్యను గొట్టిపాటి లక్ష్మి పరిష్కరించారు. ఐదు సంవత్సరాలుగా త్రిపుర సుందరి పురం గ్రామంలో బ్రహ్మంగారి గుడి, పొలాలకు వెళ్లే రోడ్‌లో లెవన్ కేవీ విద్యుత్ లైన్ ఉంది. చెయ్యి ఎత్తితే తగిలే విధముగా విద్యుత్ లైన్ ఉంది. ఎప్పుడు ఏమి జరుగుతుందో అనే భయం తో గ్రామస్తులు ఉన్నారు. పలు మార్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ప్రయోజనం లేకుండా పోయింది. త్రిపుర సుందరి పురం గ్రామ ప్రజలు నియోజకవర్గం ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మీ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే డాక్టర్ లక్ష్మి స్పందించి అధికారులు తో మాట్లాడి ప్రమాదకరంగా ఉన్న లైన్ మార్చాలని రూరల్ ఎఈ వేణు గోపాల్‌ను ఆదేశించారు. అందులో భాగంగా గురువారం ఎఈ వేణు గోపాల్, లైన్ మాన్ కొండయ్య, సిబ్బంది ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్ మార్చారు. టి.ఎస్.పురం గ్రామ ప్రజలు గొట్టిపాటి లక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు.

## అంధులకు నూతన దుస్తులు, మంచాలు బహుకరణ




ఒంగోలు, మేజర్‌న్యూస్: కర్నూల్ రోడ్‌లో ఉన్నటువంటి రావి ఆంజనేయులు వీధిలో ఉన్న గుడ్ న్యూస్ అందుల పాఠశాలలో ఈస్టర్ పండుగ పురస్కరించుకొని రెవరెండ్ ఫాదర్ డిఎస్ పాల్ అంధులైన పిల్లలకు 20 మంచాలు బహుకరించారు. ఈ కార్యక్రమంలో రవి తాను కూడా అంధులైన పిల్లలకు నూతన వస్త్రాలు బహూకరిం చారు. పిల్లలందరికీ ఈస్టర్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ మోహన్, స్వర్ణ హరిబాబు, సిస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేరాల నియంత్రణపై డ్రోన్‌లు ప్రత్యేక నిఘా: ఎస్పీ



కొమరోలు, మేజర్‌న్యూస్: నేరాల నియంత్రణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అసాంఘిక కార్యక్రమాల కట్టడి కొరకే డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ దామోదర్ గురువారం కొమరోలు మండలానికి డ్రోన్ కెమెరాను బహుకరిస్తున్న కార్యక్రమంలో తెలియజేశారు. ప్రకాశం జిల్లా పరిధిలో కొమరోలు మండలంలో లా అండ్ ఆర్డర్, నేరాలు, ట్రాఫిక్ నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, విపత్తు నిర్వహణ, ఇతర పోలీసింగ్ అవసరాల కొరకు కొమరోలు పంచాయతీ పురుషోత్తంపల్లి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ ముత్యాల రామిరెడ్డి తరపున ఆయన సోదరుడు సుబ్బారెడ్డి గురువారం మార్కాపురంలోని సౌజన్య కన్వెన్షన్ హాల్‌లో నేర సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీకి అత్యాధునిక సాంకేతికత కూడిన డిజెఐ ఎయిర్3 డ్రోన్ కెమెరాలను అందచేశారు. జిల్లా పోలీస్ శాఖకు సామాజిక బాధ్యత, సేవా స్ఫూర్తితో పోలీస్ శాఖకు డ్రోన్లను బహుకరించడం అభినందనీయమన్నారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డ్రోన్ టెక్నాలజీని వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు, ప్రతీ పోలీసు స్టేషన్ పరిధిలో చైన్ స్నాచింగ్స్, ఈవ్ టీజింగు, రహదారి ప్రమాదాలు, దొంగతనాలు, రద్దీ ఏరియాలు, అసాంఘిక కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు, నిశిత ప్రాంతాలను, బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి, ఆయా ప్రాంతాలపై డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొమరోలు పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ శివరామకృష్ణకు సీసీ కెమెరాలపై ప్రజలకు అవగాహన కల్పించి సహకరించినందుకు ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో డిఎస్పి నాగరాజు, సీఐ రామకోటయ్య, స్థానిక ఎస్సై జె. నాగరాజు పాల్గొన్నారు.

## నాటక రంగంలో ఎన్నో అవార్డులు అందుకున్న సోమేష్



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: ఈ కాలంలో నాటక రంగం అడుగున పడకుండా ఆ రంగం అభివృద్ధి కొరకు అహర్నిశలు కృషి చేస్తూ మన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నే కాక ఇతర రాష్ట్ర ప్రాంతాలలో కూడా నాటక ప్రదర్శనలు చేసి ఎంతో గుర్తింపు తెచ్చుకుని ఎన్నో అవార్డులు, రివార్డులు, సన్మానాలు, పొందిన రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి ప్రతిష్టాత్మక చేపట్టిన కందుకూరి విశిష్ట పురస్కారాన్ని అందుకున్న నిజాంపట్నం మండలంలోని బొర్రావారిపాలెంకు చెందిన లుక్క సోమేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 17వ తేదీన విజయవాడలో తుమ్మలపల్లి కలక్షేత్రంలో కందుకూరి వీరేశలింగం పంతులు 177 వ జయంతి పురస్కరించుకుని లుక్కా సోమేశ్ కి గౌరవ పురస్కారం దక్కింది. బహుమతులు అందుకున్నాడు ఈ సందర్భంగా ఆయనకు గురువారం బొర్రా వారి పాలెం లో సోమేశ్ ని సత్కరించి ఇలాంటి పురస్కారాలు మరెన్నో అందుకోవాలని అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు నర్రా సుబ్బయ్య, రేపల్లె నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు కొలసాని రాము, ఎంపిటిసీ బొర్రా సురేంద్ర, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు నరేష్ యాదవ్, స్థానిక సర్పంచ్ కేశన ముత్యాలమ్మ సోమయ్య, మరియు బీసీ నాయకులు ,గ్రామ పెద్దలు ఉన్నారు.

## ఈ-అభ్యాస్ పరీక్షలలో ప్రతిభ చూపిన సిద్ధార్థ విద్యార్థులు



భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: ప్రముఖ ఐఐటి ఈ-అభ్యాస్ అకాడమీ వారు ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి బి-మాట్,సి-మాట్,కే-శాట్,ఆర్-ఎం ఎం,ఆర్-ఎస్ ఎం.పరీక్షలలో మండల కేంద్రమైన భట్టిప్రోలు కు చెందిన సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్,వేల్పూరి నాగేశ్వరరావు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలకు చెందిన డి కీర్తన,డి సుబ్రహ్మణ్యం మొదటి బహుమతి సాధించగా,బి జెస్సి,జి గాయత్రి,బి జస్వంత్,పి జ్యోత్స్నలు ద్వితీయ బహుమతులు సాధించినట్లు,ఏ అమృత తృతీయ బహుమతి పొందినట్లు ఆయన తెలిపారు. గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరం ఆడిటోరియంలో జరిగిన 11 వ ఈ- అభ్యాస్ మహోత్సవంలో అవార్డులు విద్యార్థులకు అందించినట్లు నాగేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ కరస్పాండెంట్ నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వేల్పూరి భారతి,ఉపాధ్యాయులు డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను పాఠశాల పాలకవర్గం మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.



## ముస్లిం ధార్మిక విషయాల్లో కేంద్ర ప్రభుత్వ జోక్యం తగదు: ముఫ్తి అర్షద్

కనిగిరి, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల చేసినటువంటి వక్ఫ్ బిల్లు సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని, ఈ చట్టం చేయడం ద్వారా ముస్లింల ధార్మిక విషయాల్లో కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుంటున్నట్లు ఉంటుందని, లౌకిక రాజ్యాంగ పరిరక్షణకు అందరూ తోడ్పడాలని అంజుమన్ ఏ ఇస్లామీయ కమిటీ మాజీ కార్యదర్శి సయ్యద్ యాసీన్ అన్నారు. గురువారం స్థానిక షాదీ ఖానా లో జమాయితే ఉలేమ హింద్ మరియు అంజుమన ఏ ఇస్లామీయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా యాసిన్ మాట్లాడుతూ ముస్లిం ధార్మిక సంస్థకు చెందిన వక్ఫ్ ఆస్తులను అనగా మసీదులు ఈద్గాలు, పీర్ల చావిళ్లు ఖబరస్థాన్లు వాటికి సంబంధించిన భూములు కాంప్లెక్సులు, ఇలా అనేక భవనాలను కట్టడాలను ఇతరులకు కట్ట పెట్టేందుకు చేస్తున్న ప్రయత్నమే ఈ వక్ఫ్ సవరణ చట్టం అన్నారు. ముఫ్తి అర్షద్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులన్నీ ఇస్లాం ధార్మిక కార్యక్రమాలకు ,పేద ప్రజలకు మాత్రమే అందించాలని వారి వారి సంక్షేమం కోసం మాత్రమే ఈ నిధులు ఉపయోగించాలని అలాకాకుండా కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని ఈ వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నించటం సమంజసం కాదన్నారు. ఈ భారీ ర్యాలీలో మేధావులు, అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ ఇస్లామీయ కమిటీ మాజీ అధ్యక్షులు రోషన్నందాని, మౌలానా యునెస్ మౌలానా సద్దాం, మౌలానా యాకోబ్, తదితర ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

## వాహనాలు తనిఖీ



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు పట్టణంలో చీలు రోడ్డు సెంటర్ నందు గురువారం వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో పాల్గొన్న సీఐ రాంబాబు మాట్లాడుతూ నిషేధిత వస్తువులు రవాణా చేయకుండా చర్యలు చేపడుతున్నామని అన్నారు. పట్టణంలో గంజాయి, డ్రగ్స్, మాదకద్రవ్యాలు వంటి నిషేధిత వస్తువులు రవాణా చేయకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఎస్సై విజయ్ కుమార్, 40 మంది సిబ్బందితో డ్రైవ్ నిర్వహించారు.

# ప్రభుత్వ రుణ, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

## బీసీ కార్పొరేషన్ రుణాలు, పంచాయతీలకు ట్రాక్టర్లు పంపిణీ – ఉచిత కుట్టుమిషన్ కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ఉగ్ర






కనిగిరి,మేజర్‌న్యూస్: కనిగిరి నియోజక వర్గంలో ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ ద్వారా ఎంపికైన లబ్ధిదారులకు మంజూరైన రుణాల ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ కార్పొరేషన్ ద్వారా అందుతున్న రుణాలను దుర్వినియోగం చేయకుండా, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వెంటనే పనులు ప్రారంభించి యూనిట్లను స్థిరపరిచి, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి లబ్ధిదారులకు సూచించారు.

**కుట్టు శిక్షణా ప్రారంభించిన ఎమ్మెల్యే**

మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారిలో ఆర్థిక పరిపుష్టి కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. మహిళల్లో ఆత్మ గౌరవం, ఆర్థిక స్వావలంబన సాధించే లక్ష్యంతో ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాలు కూటమి ప్రభుత్వం నిర్వహించడం జరుగుతుందన్నారు. కనిగిరిలో 2



కుట్టు మిషన్ కేంద్రాలను ఏర్పాటు చేసిన ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం బీసీ కార్పొరేషన్ ద్వారా ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కేంద్రాలను ప్రారంభించి మహిళలలో నైపుణ్యాభివృద్ధిని పెంచే దిశగా కృషి చేస్తుందన్నారు. మహిళలకు 3 నెలలపాటు కుట్టు మిషన్ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కుట్టు మిషన్ నేర్చుకునే మహిళలు ప్రతిరోజు క్రమం తప్పకుండా హాజరై నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. మహిళల ఆర్థిక స్థితి మెరుగుపరచడానికి ఈ కుట్టు మిషన్ కేంద్రాలను ఉపయోగించుకోవాలన్నారు. మహిళలు స్వయం శక్తితో ఉపాధిని సంపాదించేందుకు ప్రభుత్వం అన్నిరకాలుగా సహకరిస్తోంది. ఈ అవకాశాలను ఉపయోగించుకొని కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవాలని అన్నారు.


**గ్రామ పంచాయితీలకు ట్రాక్టర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఉగ్ర**

స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ భారత్ కార్పొరేషన్ నిధుల ద్వారా మంజూరైన 10ట్రాక్టర్లను గ్రామపంచాయతీలకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉగ్ర మాట్లాడుతూ, గ్రామపంచాయతీలు ట్రాక్టర్లను సమర్థవంతంగా వినియోగించుకుని, చెత్త రహిత పంచాయతీలుగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలలో ఎంపిపి దంతులూరి ప్రకాశం, మున్సిపల్ కమీషనర్ డానియెల్, జోసఫ్, ఎంపిడిఓ హనుమంతరావు, లబ్ధిదారులు, మహిళలు పాల్గొన్నారు.

# పొగాకు రైతులకు న్యాయం జరిగేలా చూస్తాం: కల్యాణ్ చక్రవర్తి

## త్రోవగుంట పొగాకు వేలం–2ను సందర్శించిన బిజెపి బృందం





ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు మేరకు వికసిత్ భారత్‌లో భాగంగా అన్ని రంగాల ప్రజలను కలిసి వారికి ఉన్న ఇబ్బందులను తెలుసుకునే కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, కూటమి నాయకులతో ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం త్రోవగుంటలోని పొగాకు వేలం కేంద్రం–2ని గురువారం సందర్శించారు. పొగాకుకు ప్రస్తుతం ఉన్న గిట్టుబాటు ధర, వేలం జరుగుతున్న తీరు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. అనంతరం పొగాకు రైతులతో మాట్లాడి వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందుల గురించి అడిగి తెలుసుకున్నారు. పొగాకు వేలం కేంద్రం వద్ద చాలా మంది రైతులు వారి కష్టాలు, అవసరాలు, పంట నష్టాలు గురించి తెలియ చేస్తూ గత సంవత్సరం 300 రూపాయలు ఉంటే ఈ సంవత్సరం 280 వరకు మాత్రమే రేటు వచ్చింది అని అలాగే పంట సాగుకు పెట్టుబడి 3లక్షలు నుండి 5లక్షలు వరకు పెరిగిందని రైతులు కల్యాణ్ చక్రవర్తికి తెలియచేశారు. ఈ సందర్భంగా కల్యాణ్ చక్రవర్తి మాట్లాడుతూ ప్రపంచంలో పొగాకు ఉత్పత్తిని చేసే దేశాల్లో బ్రెజిల్, జింబాబ్వేలతో మన దేశం పోటీ పడుతుండగా ఈ సంవత్సరం ఆయా దేశాలలో పొగాకు ఉత్పత్తి బాగా పెరిగినందున మనదేశంలో గిట్టుబాటు ధర పోయిన సంవత్సరం కన్నా కొంచం తగ్గిందని కల్యాణ్ చక్రవర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పొగాకు వేలం కేంద్రం వైస్ ఛైర్మెన్ బోడపాటి భ్రహ్మయ్యతో, బోర్డు మెంబెర్ పొద వర ప్రసాద్‌తో అధికారులతో మాట్లాడి వేలంలో రైతులకు గిట్టుబాటు ధర వచ్చేలా, రైతులు నష్ట పోకుండా అధికారులు ఒక నివేదికను రూపొందించి రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. రాబోయే రోజుల్లో పొగాకు రైతులకు గిట్టుబాటు రేటు వచ్చే విధంగా స్థానిక ఎంఎల్ఏ, ఎంపి పొగాకు బోర్డ్ చైర్మన్ జి.యశ్వంత్‌తో, బిజెపి రాష్ట్ర, కేంద్ర నాయకులతో మాట్లాడి రైతులుకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా చూడాలని బీజేపీ కూటమి సభ్యులు తరుపున కల్యాణ్ చక్రవర్తి కోరారు. ఈ కార్యక్రమంలో పొగాకు బోర్డు మెంబర్లు, బిజెపి జిల్లా మాజీ అధ్యక్షులు శివ రెడ్డి, శివాజీ, పి. సుబ్బారావు, రాయపాటి అజయ్, దండు శ్రీనివాస్, అమరసింహ, రాధాకృష్ణ, తదితర బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫైనాన్స్ కమిటీ సమావేశంలో చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య





దర్శి, మేజర్‌న్యూస్: తిరుపతిలో జరుగుతున్న 16వ ఫైనాన్స్ కమిషన్ సమావేశం దర్శి మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ మున్సిపాలిటీల ప్రధాన కార్యదర్శి సురేష్ కుమార్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్రంలోని 15మంది మున్సిపల్ చైర్మన్లలు హాజరు అయ్యారు. ప్రధాన కార్యదర్శి సురేష్ ఆహ్వానం మేరకు దర్శి నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య హాజరయ్యారు.



# మన మిత్ర, శక్తి యాప్‌లపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలి

## బ్రోచర్‌ను ఆవిష్కరించిన కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

ఒంగోలు, మేజర్‌న్యూస్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్), శక్తి యాప్ లపై క్షేత్ర స్థాయిలో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన మన మిత్ర (వాట్సాప్ గవర్నెన్స్), శక్తి యాప్‌లపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు రూపొందించిన బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, జిల్లా అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర రావు, ఇరిగేషన్ ఎస్ ఈ వరలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే కందుల




పొదిలి, మేజర్‌న్యూస్: తిరుమల తిరుపతి దేవస్థానంలో గురువారం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి ని దర్శించుకున్నారు. ఆయన వెంట ప్రముఖ కాంట్రాక్టర్ తూమాటి నరసింహారెడ్డి, రాష్ట్ర తెలుగు యువత కా కర్యదర్శి కామసాని రామిరెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఏఎంసి చైర్మన్‌గా నియమితులైన ఇమాంసాకు శుభాకాంక్షలు తెలిపిన తెదేపా నాయకులు



పొదిలి, మేజర్ న్యూస్: పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన మాజీ ఎంపిటిసి డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్ ను గురువారం స్థానిక విశ్వనాథపురం లోని ఇమాంస క్లినిక్ లో టిడిపి యువ నాయకులు దత్తులూరి వెంకట్రావు,కాటూరి హనుమంతరావు, చాగంటి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే ఇమాంస క్లినిక్ లో టిడిపి రాష్ట్ర టిడిపి రైతు సంఘం కార్యదర్శి ఆవులూరి ఎలమంద, మాదిరెడ్డిపాలెం సొసైటీ అధ్యక్షులు ఎర్రంరెడ్డి వెంకటేశ్వర రెడ్డి, మైనార్టీ నాయకులు షేక్ షబ్బీర్, విద్యుత్ శాఖ ప్రముఖ కాంట్రాక్టర్ తానికొండ వెంకట్రావు, బత్తిన ఓబయ్య, బత్తుల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



## హజ్ కమిటీ సభ్యులుగా హుస్సేన్‌బేగ్



మార్కాపురం రూరల్, మేజర్ న్యూస్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులుగా మార్కాపురం పట్టణానికి చెందిన జనసేన పార్టీ రాష్ట్ర మైనారిటీ నాయకులు మిర్జా ఆబిద్ హుస్సేన్ బేగ్ నియమితుల య్యారు. ఆంధ్రప్రదేశ్ హజ్ కమిటీ సభ్యులుగా మిర్జా ఆబిద్ హుస్సేన్ బేగ్‌ని నియమిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా ఆబిద్ మాట్లాడుతూ నామీద నమ్మకంతో నాకు బాధ్యత కల్పించిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

## వృద్ధాశ్రమానికి ప్లేట్లు, గ్లాసులు వితరణ



గిద్దలూరు, మేజర్‌న్యూస్: యువ ప్రగతి పథం స్వచ్ఛంద సంస్థ సభ్యుల సొంత నిధులతో గిద్దలూరు నగర పంచా యతీ పరిధిలోని సంజీవనీ అనాథ వృద్ధాశ్రమ శరణాలయంలో ఉన్న వృద్ధులకు ఆహారం భుజించుటకు అవసరమైన కంచాలు, గ్లాసులు వితరణ చేయటం జరిగింది. చల్లటి మజ్జిగ ప్యాకెట్లు అందచేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పగిడి వేణుగోపాల్ మాట్లాడుతూ సొంత వారి ప్రేమకు దూరమై వృద్ధా శ్రమాల్లో అనాథ ఆశ్రమాల్లో తలదాచు కుంటున్న వృద్ధులకు నేటితరం యువత అండగా నిలిచి సమాజ సేవ అనేది ఆత్మ సంతృప్తిని కలిగించే ఉత్తమమార్గమని ప్రతి ఒక్కరు సాటి మనిషిని ప్రేమించడం అలవర్చుకొని ఆపదలో ఉన్నవారికి చేత నైనంత సహాయం చేయటం ప్రతి ఒక్కరి విధి అన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవని అనాథ వృద్ధాశ్రమ నిర్వాహకులు రాజా శేఖర్ యువ ప్రగతి పథం సంస్థ సభ్యులు రత్నం, సిద్దయ్య, కుశాంత్ రెడ్డి, భార్గవ్, శ్రీనివాసరెడ్డి, పీరయ్య, శ్రీనివాసులు, నాయబ్, కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ బిల్లు ఆమోదంపై ఎస్సీ నేతలు హర్షం



చీరాల రూరల్, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని చీరాల రూరల్ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో ఆమోదం తెలపటం పట్ల చీరాలలో కూటమి ఎస్సీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. దళిత వర్గాలకు కూటమి ప్రభుత్వంతోనే సమన్యాయం జరుగుతుందని నాయ కులు అన్నారు. ఎస్సీ వర్గాల్లో సమన్యాయం కోసం మొదట బీజం వేసింది టిడిపి ప్రభుత్వం అని ఇచ్చిన మాటకు కట్టుబడి అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఏకైక నాయకుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారు గుర్తు చేశారు. డీఎస్సీ నాటికి ఎస్సీ వర్గీకరణ పూర్తి చేసి చిరకాల ఎస్సీ సోదరుల కలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న విధానాలు చాల గొప్పవని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు గుమ్మడి ఏసురత్నం, ఉసురుపాటి సురేష్, శివరాం ప్రసాద్, వినోద్, శరత్ పాల్గొన్నారు.

## మానసిక వికలాంగుల పాఠశాలలో రియాజ్ పుట్టినరోజు వేడుకలు




మార్కాపురం రూరల్, మేజర్‌న్యూస్: జనసేన పార్టీ ప్రకాశం జిల్లా అధ్యక్షులు షేక్ రియాజ్ జన్మదిన సందర్భంగా మార్కాపురం జనసేన పార్టీ ఆధ్వర్యంలో గురువారం మార్కాపురం పట్టణంలోని స్ఫూర్తి వెల్ఫేర్ అసోసియేషన్ మానసిక వికలాంగుల పాఠశాలలో కేక్ కట్ చేసి అనంతరం భోజన సదుపాయం కలిగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు పేరూరు రమేష్, షేక్ ఖాసిం వలి, బోనగిరి ఏడుకొండలు, షేక్ తాజ్బున్, షేక్ హుస్సేన్, నిసనం పాపయ్య, డి.ఖాసిం, దుమ్మని చందు, మస్తాన్, జనసేన కార్యకర్తలు పాల్గొన్నారు.

# బార్ అసోసియేషన్ న్యాయవాదులతో సమావేశం



గిద్దలూరు, మేజర్‌న్యూస్: మే 10న జరగబోయే జాతీయ లోక్ అదాలత్ నందు ఎక్కువ కేసుల పరిష్కారం కొరకు గిద్దలూరు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏ.ఓంకార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కేసులను త్వరి తగతిన పరిష్కరించుకోవటానికి రాజీ మార్గం ఉత్తమమని తెలియజేశారు. ఇరు పార్టీలకు ఆమోద యోగ్యమైన షరతులను అవార్డుతో పొందుపర చుకోవడం ద్వారా, ఇరు పార్టీలు గెలిచినట్లు అని తెలియజేశారు. సమస్యలను సాంప్రదాయ వాతావ రణంలో పరిష్కరించుకోవడం ద్వారా, సమాజంలో శాంతి నెలకొంటుందని తెలియజేశారు. సమయం, ధనము ఆదా అవుతాయని, కావున కక్షిదారులు ఈ అవకాశమును సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా దానమ్మ, బార్ అసోసియేషన్ అధ్యక్షులు పి.ఎన్.శేషశయనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఎస్.కె.ఉస్మాన్ షరీఫ్, ట్రెజరర్ ఎం.రంగారెడ్డి, సీనియర్ న్యాయవాదులు వి.వి.రామిరెడ్డి, పి.రాజశేఖర్ రెడ్డి, టి.ఈ.ఆం జానీ కుమార్, కె.హిమశేఖర్ రెడ్డి, ఎస్.వి.భా స్కరరావు, డి.సంగీతరావు, ఎస్.వి.చల పతిరావు, కె.నిరంజన్ కుమార్, సిహెచ్ పోలయ్య, బి.ప్రకాశ్, మొగల్ హాజరాంబి, కె.పోలయ్య, బి.ఐజాక్, ఏ.తిరుమల ప్రసాద్, జూనియర్ న్యాయవాదులు ఎం.పిచ్చయ్య, డి.సంధ్యా రాణి, పి.లావణ్య, బి.రాజ్ కుమార్ నాయక్, వి.వి.ఎన్ సుధీర్ కుమార్, రంగమోహన్, డి.సిద్దయ్య, కె.విక్రమాదిత్య రెడ్డి, యస్.కె.ఫాజిల్, పారా లీగల్ వాలంటీర్ అద్దంకి మధుసూధన రావు పాల్గొన్నారు. కక్షిదారుల సౌకర్యార్థమై గిద్దలూరు నగర పంచాయతీ వారి సౌజన్యంతో కోర్టు ప్రాంగణం నందు చలివేంద్రాన్ని న్యాయమూర్తులు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరీ సారా దానమ్మ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

## వక్ఫ్ బిల్లుకు మద్దతు పలికిన కూటమికి నూకలు చెల్లినట్లే

### వైసీపీ నాయకులు సయ్యద్ గౌస్ మోహిద్దీన్



మార్కాపురం, మేజర్‌న్యూస్: ముస్లిం సమాజానికి చేటు చేసేలా కేంద్రంలోని మోడీ సర్కార్ తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు పలికిన టీడీపీ, జనసేన పార్టీలకు రాష్ట్రంలో నూకలు చెల్లినట్లేనని వైసీపీ మైనార్టీ నాయకులు సయ్యద్ గౌస్ మోహిద్దీన్ హెచ్చరించారు. వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా ముస్లిం సమాజంలో వస్తున్న వ్యతిరేకతే దీనికి నిదర్శనమన్నారు. ముస్లింలకు అన్యాయం చేసిన టీడీపీ, జనసేన పార్టీలకు ఇపుడు ఎస్సీ, ఎస్టీ, బీసీలు కూడా నమ్మే పరిస్థితి లేదన్నారు. ఈ రోజు ముస్లింలకు అన్యాయం చేసిన వారు రేపు తమకు అన్యాయం చేసే ప్రమాదంఉందని ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు భావిస్తున్నాయని, ఈ అభిప్రాయం ఇపుడిపుడే ఈ వర్గాల్లో మొదలవుతోందన్నారు. ఇక ఏపీలో కూటమి సర్కార్‌కు నూకలు చెల్లినట్లేనని చెప్పడా నికి ఇదే నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. రాబోవు ప్రతి ఎన్నికల్లో కూటమి సర్కార్ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ముస్లింలకు వైసీపీ వ్యతిరేకమన్న దుష్ప్రచారం కొంతమంది చేసే ప్రయత్నం చేశారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు.

## అంబేద్కర్‌ను అవమానించిన వారిపై చర్యలు తీసుకోవాలి



చీరాల, మేజర్‌న్యూస్: కాకినాడ జిల్లా శంఖారావం మండలం దళితవాడలో ప్రపంచ మేధావి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి చెప్పులు దండ వేసి ఘోరంగా అవమానించిన దుండగులను అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని దళిత బహుజన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ జిలాని డిమాండ్ చేశారు. గురువారం చీరాల తహసిల్దార్ కార్యాలయం ఎదుట దళిత బహుజన పార్టీ నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసిల్దార్ గోపికృష్ణకు వినతిపత్రం అందజేశారు. షేక్ జిలాని మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి, అన్నీ వర్గాల ప్రజలు ఆరాధ్య దైవంగా భావించే మహోన్నతమైన వ్యక్తి అంబేద్కర్ ను ఘోరంగా అవమానపరిచే చర్యలకు పాల్పడడం దుర్మార్గమని అన్నారు. ఘటనకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించి భవిష్యత్తులో ఇటువంటివి పునరావృతంగా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మున్న, షేక్ అలీ, షేక్ అబ్దుల్ ఖాదర్, వెంకట చలపతి, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ రుణాలు సద్వినియోగపర్చుకోవాలి: ఎంపిడివో



సంతనూతలపాడు, మేజర్ న్యూస్: సబ్సిడీతో కూడిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలను లబ్ధిదారులు సద్వినియోగపర్చు కోవాలని ఎంపీడీవో డి.సురేష్ బాబు కోరారు. 21 సంవత్సరాల నుండి 50 సంవత్సరాలు లోపు గల ఎస్సీ వర్గీయులు ఇం దుకు సంబంధించి మే 13వ తేదీ లోపు సచివాలయాలు, ఆన్లైన్ పోర్టర్ ద్వారా దరఖా స్తులను దాఖలు చేయాలన్నారు. త్వరలో మండలానికి వీటికి సంబంధించి ఎలాట్మెంట్ ఇవ్వను న్నారు. 2025-26 వార్షిక సంవత్స రానికి సంబంధించి ఎస్సీ కార్పొరే షన్‌కు చెందిన ఈ సబ్సిడీ పథకాలకు లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో సురేష్ బాబు కోరారు.

## పోషణ పక్వాడపై అవగాహన



సంతనూతలపాడు, మేజర్‌న్యూస్: మండలంలోని గురువారెడ్డి పాలెంలో గురువారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గర్భవతులు, బాలింతలకు పోషణ పక్వాడ పై అవగాహన కల్పించారు. తక్కువ ఖర్చుతో తయారయ్యే నాణ్యమైన పోషక పదార్థాలను తీసుకుంటే ఆరోగ్య సంరక్షణ కలుగునని అంగన్వాడీ టీచర్ కే.రంగమ్మ, ఏఎన్ఎం.అంజనీ దేవిలు కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఎన్వి రమణమ్మ, ఆర్.నాగలక్ష్మి, కే.రంగమ్మ, మహిళా పోలీస్ ప్రశాంతి సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## వరిగడ్డి వామి దగ్ధం

వెలిగండ్ల, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని కొట్టాలపల్లి గ్రామంలో వరిగడ్డి వామి దగ్ధమైంది. ఆ గ్రామ రైతు కొంగు వెంకటేశ్వర్ రెడ్డి తెలిపిన ప్రకారం గురువారం నాడు మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తన వామిదొడ్డి పైన ఉన్న విద్యుత్ వేరు ఉన్నందున షార్ట్ సర్క్యులేషన్ జరిగి వరిగడ్డి వాము దగ్ధమైనదని తెలిపారు. దీని విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని రైతు తన ఆవేదన వ్యక్తం చేశారు. కనిగిరి ఫైర్ స్టేషన్ ఫోన్ చేయగా ఫైర్ ఇంజన్ వచ్చి మంటలను ఆర్పినట్లు ఆయన తెలిపారు. అప్పటికే పూర్తిగా వరిగడ్డి వామి దగ్ధమైంది.

## విద్యార్థినికి అభినందనలు తెలిపిన ఆకుపాటి



పామూరు, మేజర్‌న్యూస్: నవోదయకు ఎంపికై సీటు సాధించిన డి.శరణ్యను టిడిపి యువ నాయకులు ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ అభినందించారు. పట్టణంలోని యూనిట్ అకాడమీ ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమం గురువారం నిర్వహించారు. వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొని నవోదయకు ఎంపికైన విద్యార్థినికి బహుమతిని బహుకరించారు. కార్యక్రమం లో నీరు కట్టు రసూల్, పుప్పాల రామ్మూర్తి నాయుడు, ఇనిస్టిట్యూట్ డైరక్టర్‌లు జెవి నవీన్, ఎమ్.రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్‌కు సన్మానం



పామూరు, మేజర్‌న్యూస్: ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్‌గా టిడిపి సీనియర్ నాయకులు మోబినా మౌలాలిని సత్కరించి అభినందనలు తెలిపారు. విశ్వనాధుని మోహన్ రావు, కొండా నరసింహులు, తోట రవికుమార్, కోటపాటి లక్ష్మిరెడ్డి శేషగిరి, నరసింహారెడ్డి పాల్గొని మోబినా మౌలాలిని శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి



## మార్కాపురం వైసిపి సమన్వయకర్త అన్నా

పొదిలి, మేజర్‌న్యూస్: ఈ ఏడాది పొగాకు సాగులో పెరిగిన సాగు ఖర్చులను దృష్టిలో ఉంచుకొని పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మార్కాపురం నియోజక వర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు కోరారు. బుధవారం ఆయన స్థానిక పొగాకు వేలం కేంద్రాన్ని సందర్శించి పొగాకు రైతులు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది పొగాకు పండించేందుకు ఖర్చులు ఎక్కువ య్యాయని పేర్కొన్నారు. అయితే వ్యాపారులు సిండికేట్‌గా మారి గిట్టుబాటు ధర కల్పించడం లేదని విమర్శించారు. గత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో మార్క్ఫెడ్ ల ద్వారా కొనుగోలు చేసి ప్రతి పంటకు గిట్టుబాటు ధర కల్పించడం అయితే టిడిపి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయకపోతుండడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఇప్పటికైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పొగాకు రైతులకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ వింగ్ కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, వైకాపా రాష్ట్ర కార్యదర్శి కే వి రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి మెట్టు వెంకటరెడ్డి, జిల్లా కార్యదర్శి గోల మూరి చెన్నారెడ్డి, క్లాస్ వన్ కాంట్రాక్టర్ కల్లం సుబ్బారెడ్డి, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు గుజ్జుల సంజీవరెడ్డి, కొనకనమిట్ల జడ్పిటిసి అక్కి దాసరి ఏడుకొండలు, మండల కన్వీనర్ మోరశంకర్‌రెడ్డి, కామసాని వెంకటేశ్వరరెడ్డి, మండలపు శ్రీని వాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఏఎంసీ చైర్మన్ గా నియమితులైన ఇమాంసాకు శుభాకాంక్షలు తెలిపిన టిడిపి నాయకులు

పొదిలి, మేజర్‌న్యూస్: పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియమితులైన మాజీ ఎంపిటిసి డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్ ను గురువారం స్థానిక విశ్వనాథపురం లోని ఇమాంస క్లినిక్ లో మాజీ సర్పంచ్ కాటూరి చిన్నబాబు, టిడిపి మండల అధ్యక్షులు మీగడ ఓబులరెడ్డి, మహమ్మద్ గౌస్, ముల్లా గౌస్ బాషా, మల్లా రబ్బాని, మస్తాన్ తదితరులు లు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇమామ్ సాహెబ్ కు శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.

### ఇమాంసాకు శుభాకాంక్షలు తెలిపిన గునుపూడి



పొదిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన మాజీ ఎంపిటిసి డాక్టర్ సయ్యద్ ఇమామ్ సాహెబ్‌ను గురువారం స్థానిక విశ్వనాథపురంలోని ఇమాంస క్లినిక్‌లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, శివాలయం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, టిడిపి నాయకులు స్వామి రాజా, దివ్వెల మురళి, సరైనోడు తదితరులు మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఇమామ్ సాహెబ్ కు శాలువా కప్పి సత్కరించి, స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ నిరసన



చీమకుర్తి, మేజర్‌న్యూస్: బండ్లమూడి పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్స్‌కి వినతిపత్రం డిమాండ్స్‌ని తెలియజేస్తూ వినతిపత్రం అందజేశారు. యన్ హెచ్ ఎమ్ ఉద్యోగులతో సమానంగా సిహెచ్‌ఓ లకు కూడా 23% హైక్ అందించాలి. పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి ఆరు సంవత్సరాలు పూర్తయిన సి ఎచ్ ఓ లను రెగ్యులర్ చేయాలి ఈపీఎఫ్ పునరుద్ధరణ ఫిక్స్ పే చేసి ఉద్యోగ భద్రత కల్పించాలి ఇటువంటి నాణ్యమైన న్యాయమైన డిమాండ్లు వెంటనే పూర్తిచేసి గవర్నమెంట్ లో ఉండి గవర్నమెంట్ కోసం పనిచేసే మాలాంటి ఉద్యోగస్తులకు న్యాయం చేయాలని శాంతి యుతంగా విన్నవించుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో డేవిడ్, చిత్రవర్మ, కిరణ్, షాలెం, నిర్మల, బాల విమల,దీప్తి, అనూష, గ్రేస్, భాగ్య లక్ష్మీ, శ్రావణి.సుదీప్త. తదితరులు పాల్గొన్నారు..

## చీమకుర్తిలో కార్డెన్ సెర్చ్




చీమకుర్తి, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, ప్రకాశం జిల్లా ఏఆర్ అడిషనల్ ఎస్పీ ఎం.ఎస్.ఎస్. అశోక్ బాబు అద్వర్యం లో చీమకుర్తి పట్టణంలోని గరికమిట్ట, మండల పరిధిలోని పులి కొండ, మర్రిచెట్లపాలెం గ్రామాలలో ఎలాంటి అసాంఘీక కార్యకలాపాలు జరగకుండా, గంజాయి నిర్మూలనలో భాగంగా అనుమానంగా ఉన్న ప్రదే శాలలో వాహనాల తనిఖీ, కార్డాన్ సెర్చ్ నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు ఆర్.ఐ. ఎస్.వి. రమణారెడ్డి, చీమకుర్తి ఎస్.ఐ కృష్ణయ్య, ఆర్.ఎస్.ఐ లు, డాగ్ స్క్వాడ్, బిడి టీం, జిల్లా పోలీస్ సిబ్బంది, చీమకుర్తి పోలీస్‌స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

కనిగిరి, మేజర్‌న్యూస్: మే 15వ తేదీ నుండి 18వ తేదీ వరకు తిరుపతి నగరంలో జరిగే 17వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రభాకర్ పిలుపు నిచ్చారు. స్థానిక దర్శి చెంచయ్య భవనం నందు గురువారం జాతీయ మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు.

## కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలి

### మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్



కనిగిరి, మేజర్‌న్యూస్: తిరుపతిలోని కలెక్టర్ కార్యాలయం నందు జరిగిన 16 ఫైనాన్స్ కమిషన్ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ హాజర య్యారు. 16వ ఫైనాన్స్ కమిషన్ ఆఫ్ ఇండియా రాష్ట్రంలోని 15 మంది మేయర్లు, మున్సిపల్ చైర్మన్లతో స్థానిక సంస్థలు బలోపేతానికి మరియు అభివృద్ధిపై సమావేశం గురువారం నిర్వహించారు. సమావే శానికి కనిగిరి మున్సిపల్ చైర్మన్‌కు ఆహ్వానం అందడంతో ఆయన తిరుపతిలో జరిగిన సమా వేశంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ కనిగిరి మున్సిపాలిటీ అభివృద్ధికి సాధ్యమైనంత ఎక్కువ నిధులు మంజూరు చేయాలని కోరారు. పట్టణంలో నీటి సరఫరాకు జనరల్ ఫండ్ కాకుండా ప్రత్యేకంగా ఏఎస్‌సి గ్రాంట్ విడుదల చేయాలని సమావేశా నికి హాజరైన 16వఫైనాన్స్‌కమిషన్ ఆఫ్ ఇం డియా డాక్టర్ అరవింద పనగరియను కోరారు. ముందుగా రాష్ట్ర మున్సిపాలిటీల ప్రత్యేక కార్య దర్శి సురేష్ కుమార్‌తో జరిగిన సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్ పాల్గొన్నారు.

## జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా పాలపర్తి విజేష్‌రాజ్



ఒంగోలు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా పాలపర్తి విజేష్ రాజ్ నియమితులైయ్యారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రస్తుతం పాలపర్తి విజేష్ రాజ్ సంతనూతలపాడు కో–ఆర్డినేటర్‌గా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో జిల్లా జనరల్ సెక్రటరీగా బాధ్యతను అప్పగిస్తూ వైఎస్ షర్మిల ఆదేశించారు. ఈ క్రమంలో వైఎస్ షర్మిల రెడ్డికి, జిల్లా అధ్యక్షులు షేక్ సైదాకి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని, బాధ్యత ను సక్రమంగా నిర్వహి స్తానని, పార్టీ బలోపేతానికి నా శక్తి వంచన లేకుండా కృషి చేస్తాను అని తెలియ జేశారు. ఈ సందర్భంగా నా శ్రేయోభిలాషులు అందరికీ కూడా మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలిపారు.

## వాడరేవులో భారీగా గోవా మద్యం సీజ్



చీరాల, మేజర్‌న్యూస్: మండలంలోని వాడరేవు వైఎస్ఆర్ కాలనీలో ఎక్సైజ్ డిపార్ట్మెంట్, పోలీసు, రెవెన్యూ డిపార్ట్మెంట్ మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ఇళ్లలో నిల్వ ఉంచిన గోవా రాష్ట్రానికి చెందిన 550 మద్యం బాటిళ్లను గుర్తించి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విక్రయాలు జరుపు తున్న ఇద్దరు ముద్దాయిలను అరెస్ట్ చేయడం జరిగిందని పోలీసులు తెలిపారు. ఈ లిక్కరు మొత్తం విలువ సుమారు రూ.55వేలు వరకు ఉంటుందన్నారు. ఎవరె వరైనా సరే పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి అమ్మినట్లైతే కఠినమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. పట్టుబడిన నిందితులను కోర్టులో హాజరు పరుస్తామన్నారు. ఈ దాడులలో చీరాల స్టేషన్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ బి.శ్రీహరి, కేర్ రమాదేవి, స్టేషన్ సిబ్బంది, ఒంగోలు ఎన్ఫోర్స్మెంట్ సీఐ రామారావు, ఎస్సై రాజేంద్రప్రసాద్, టూటౌన్ ఏఎస్ఐ టి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టణ శివారు ప్రాంతాల్లో పోలీసుల కార్డెన్ సెర్చ్



పొదిలి, మేజర్‌న్యూస్: జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు గురువారం దర్శిడిఎస్పి డి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పట్టణంలోని పిచ్చిరెడ్డి తోట, మార్కాపురం అడ్డరోడ్డు, దర్శి రోడ్డు, కాటూరివారి పాలెం,రైల్వే ట్రాక్ వద్ద ఒంగోలు స్పెషల్ పార్టీ పోలీసులతో సీఐ టి వెంకటేశ్వర్లు, ఎస్సై వి వేమనకార్డెన్ సెర్చ్ నిర్వహించారు.ఆయా ప్రాంతాలను పోలీసులు అణు వణువు క్షుణ్ణంగా పరిశీలించారు. సరైన పత్రాలు లేని వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనుమానితులు ఎవరైనా సంచరి స్తుంటే పోలీస్ శాఖకు సమాచారం అందించాలని సీఐ టీ.వెంకటేశ్వర్లు, ఎస్సై వి.వేమనలు కోరారు.

## కాటూరివారిపాలెంలో సోలార్ విద్యుత్‌పై అవగాహన

పొదిలి, మేజర్‌న్యూస్: నగర పంచాయతీ పరిధిలోని కాటూరి వారి పాలెం గ్రామంలో గురువారం విద్యుత్ శాఖ అధికారులు సోలార్ విద్యుత్ పై ప్రజలకు అవగాహన కలిగించారు. విద్యుత్ అదనపు లోడుకు ప్రభుత్వం 50% రాయితీ ఇచ్చిందని, వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దర్శి విద్యుత్ శాఖ ఈ ఈ పాలగిరి శ్రీనివాసులు, డిప్యూటీ ఈ ఈ హరిబాబు, పొదిలి ఏఈ కె మోహన్ రెడ్డి, సబ్ ఇంజనీర్ రాజేష్, విద్యుత్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



సూర్య www.suryaa.com



## గృహ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలి

### అదనపు ఆర్థిక లబ్ధిని సద్వినియోగం చేసుకునేలా చూడాలి

### జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: పేద వాని సొంతింటి కల నెర వేర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం త్వరగా ఇళ్ళ నిర్మాణాలను పూర్తీ చేయడానికి అదనంగా ఆర్థిక సహాయం అందచేస్తున్నందున, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాకలెక్టర్ తమీమ్ అన్సారియా, గృహ నిర్మాణ శాఖ ఇంజనీరింగ్ అధికారులతో సమా వేశమై జిల్లాలో చేపట్టిన గృహ నిర్మాణాల పురోగతిపై సమీక్షించి దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లాకలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గృహ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి జూన్ మాసంలో రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల గృహాలకు సామూహిక గృహ ప్రవేశాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్దేశించడం జరిగింద న్నారు. అలాగే పనులకు సంబంధించిన బిల్లుల అప్ లోడింగ్, జియో ట్యాగింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడే ఆన్ లైన్‌లో అప్ లోడ్ చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. జన్‌మన్ కార్యక్రమం కింద చేపట్టే గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా సంబంధిత మండల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పిడి శ్రీనివాస ప్రసాద్, డిఆర్‌డిఏ పిడి నారాయణ, మెప్మా పిడి శ్రీహరి, ఒంగోలు మునిసిపల్ కమీషనర్ వెంకటేశ్వర రావు, జిల్లాలోని మునిసిపల్ కమీషనర్లు, గృహ నిర్మాణ శాఖకు సంబంధించిన ఈఈలు, డిఈలు, ఎఈలు తదితరులు పాల్గొన్నారు.

## యువతకు స్ఫూర్తి రామ్మోహన్‌నాయుడు

### యంగ్ గ్లోబల్ లీడర్‌గా ఎంపిక దేశానికే గర్వకారణం : డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ





దర్శి, మేజర్‌న్యూస్: కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రికే రామ్మోహన్ నాయుడు ప్రతిష్టాత్మకమైన యంగ్ గ్లోబల్ లీడర్‌గా గుర్తింపు పొందడం తెలుగువారికి గర్వ కారణంఅని, ప్రజాసేవలో అంకితభావం ఉన్న రామ్మోహన్ నాయుడు యువతకు స్ఫూర్తి ప్రదాతగా నిలుస్తారని దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నుండి ప్రేరణ పొందడం సంతోషకరమైన పరిణామంగా చెప్పవచ్చున్నారు. మరిన్ని ఉన్నత శిఖరాలకు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎదగాలని కోరుకుంటున్నాట్లు డాక్టర్ లక్ష్మి తెలిపారు.











## ఘనంగా షేక్ రియాజ్ జన్మదిన వేడుకలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: ఉమ్మడి ప్రకాశం జనసేన పార్టీ అధ్యక్షులు షేక్ రియాజ్ పుట్టినరోజు వేడుకలను గురువారం ఒంగోలులో ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. జనసేన శ్రేణులు బర్త్‌డే కేక్ కట్ చేసి రియాజ్‌కు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సంద ర్భంగా పలు దేవాలయాల్లో పూజలు, పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఒంగోలులోని చెన్నకేశవ స్వామి దేవస్థానంలోని ఆంజనేయస్వామిలో పూజా కార్యక్రమాన్ని చేశారు. అలానే పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అక్కడ నుండి 37వ డివిజన్ సుజాతనగర్‌లో చలివేంద్రం ఏర్పాటు చేసి కేక్ కట్ చేయడం జరిగింది. అనంతరం కోలాస్ పక్కన ఉన్న అన్న క్యాంటీన్లో 21వ డివిజన్‌లో అన్నదానం చేసి కేక్ కట్ చేశారు. అలానే సీతారాంపురంలోని సమత వృద్ధాశ్రమంలో పేదలకు పళ్ళు పంపిణీ పంపిణీ చేశారు. బొమ్మరిల్లులో కేక్ కట్ చేసి, అన్నదానం చేసి, పేద పిల్లలకు యూనిఫామ్ పంపిణీ చేయడం జరిగింది. బండ్లమిట్టలో కేక్ కట్ చేయడం జరిగింది. 36వ డివిజన్ నిర్మల్ నగర్ పార్కు వద్ద కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చడం జరిగింది. 32వ డివిజన్ గద్దలగుంట గాంధీ బొమ్మ వద్ద కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు చిట్టెం ప్రసాద్, ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శులు చనపతి రాంబాబు, కళ్యాణ్ ముత్యాల, కృష్ణ పెన్నా ప్రాంతీయ కమిటీ సభ్యులు బొందిల శ్రీదేవి, ఒంగోలు నగర జనసేన పార్టీ ఉపాధ్యక్షులు పిల్లి రాజేష్, ఒంగోలు నగర జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శులు పల్ల ప్రమీల, దండే అనిల్ కుమార్, ఒంగోలు నగర జనసేన పార్టీ కార్యదర్శులు గోవింద్ కోమాలి, ఆకుపాటి ఉష, జనసేవ శ్రీనివాస్, ఒంగోలు నగర జనసేన పార్టీ సంయుక్త కార్యదర్శులు సుంకర కళ్యాణి, తన్నీరు ఉష, తొమ్మిదో డివిజన్ అధ్యక్షులు నరసింహారావు, మూడో డివిజన్ అధ్యక్షురాలు షేక్ ముంతాజ్, పదో డివిజన్ అధ్యక్షులు తెళ్ళ హరీష్, రెండోడివిజన్ అధ్యక్షులు బ్రహ్మనాయుడు, 26వ డివిజన్ అధ్యక్షులు షేక్ ఇర్ఫాన్, 31వ డివిజన్ అధ్యక్షులు వాసాని అంకబాబు, 37వ డివిజన్ అధ్యక్షులు నరహరి సాంబయ్య, 15వ డివిజన్ ఉపాధ్యక్షులు ఉంగరాల సాయి, 16 డివిజన్ ఉపాధ్యక్షులు కరి శ్రీకాంత్, కార్యక్రమాల కమిటీ సభ్యులు బొందిల మధు, తిరుమల శెట్టి నాని, మరియు జనసేన నాయకులు కోట మనోహర్, శ్రీసాయి, శాలు,శ్రీను, ఆనంద్ నాయుడు కత్తుల, నవీన్ నాయుడు, అవినాష్ నాయుడు, వీర మహిళలు నక్క ప్రమీల, ఏడుంబాకుల అనూష, అనంతలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## నీటి తొట్టెల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ అధికారులకు ఆదేశం



ఒంగోలు, మేజర్‌న్యూస్: వేసవి దృష్ట్యా పశువులకు దాహం తీర్చే నీటి తొట్టెల నిర్మాణంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటానని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా హెచ్చరించారు. గురువారం ప్రకాశం భవనంలో డ్వామా అధికారులతోనూ, ఎంపీడీవోలతోనూ ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్న నీటితొట్టెల నిర్మాణంలో జాప్యాన్ని సహించబోనని కలెక్టర్ స్పష్టం చేశారు. మంజూరు అయిన నీటితొట్టెల నిర్మాణాలను ఈ నెల 22వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. వీటితో పాటు ఫారం పాండ్స్ నిర్మాణంపైనా దృష్టి సారించాలని చెప్పారు. ఉపాధి హామీ పనులు చేపట్టడానికి వేసవి కాలం అనుకూలం అయినందున పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించాలని అన్నారు. వచ్చే మూడు నెలలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. లేబర్ మొబిలైజేషన్ పైనా ప్రత్యేకశ్రద్ధ పెట్టాలన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ నిధుల మంజూరుకు లేబర్ మొబిలైజేషన్ కీలకం అని ఆమె స్పష్టం చేశారు. కూలీలకు రోజువారి సగటు వేతనం రూ.290కు తగ్గకుండా చూడాలని చెప్పారు. చేపట్టిన పనులను ఎప్పటికప్పుడు యాప్‌లో నమోదు చేయాలని అన్నారు. ఈ విషయాల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. సిబ్బంది ప్రతిరోజూ ఫీల్డ్ లో ఉండాలని ఆమె స్పష్టం చేశారు. కాగా, ఆయా పనులలో పురోగతిని పి.డీ జోసఫ్ కుమార్ కలెక్టరుకు వివరించారు. ఈ సమావేశంలో ఏ.పి.డిలు, ఏ.పి.ఓలు, ఈ.సిలు పాల్గొన్నారు.

## బాధితునికి పోలీస్ భరోసా ఇవ్వాలి


### జిల్లా నేర సమీక్షలో ఎస్పీ ఏఆర్ దామోదర్ పోలీస్ అధికారులకు ఆదేశం







మార్కాపురం, మేజర్‌న్యూస్: న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలని పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ సూచించారు. నెలవారీ నేర సమీక్షలో భాగంగా జిల్లా పోలీస్ అధికారులతో గురువారం పట్టణంలోని సౌజన్య కన్వెన్షన్ హాల్‌లో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఎఫ్ఎస్ఎల్ డైరెక్టర్ ఐజి పాలరాజు జిల్లాలో జరిగిన నేర సమీక్ష సమావేశాన్ని జూమ్ వీడియో కాన్ఫరెన్స్‌లో సిసిటిఎన్ఎస్ ద్వారా పర్యవేక్షించారు. పోలీస్ స్టేషన్ వారిగా పెండింగ్ కేసులకు సంబంధించి నేరస్థుల అరెస్టు, దర్యాప్తు, సాక్ష్యాధారాల సేకరణ, చార్జ్‌షీట్‌కు సంబంధించి ప్రస్తుత కేసుల స్థితిగతులపై ఎస్పీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి వెంటనే వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ కేసుల విషయంలో నిరంతర పర్యవేక్షణ ఉంటుందని, కొత్త కేసులతో పాటు చాలా కాలంగా పెండింగ్ కేసులను ఎప్పటికప్పుడు సమీక్షించడం ద్వారా కేసుల సంఖ్య తగ్గించే దిశగా అన్ని స్థాయిల అధికారులు పని చేయాలన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి చొరవ చూపించి వాటి సంఖ్యను తగించేలా కృషి చేయాలన్నారు. ఆర్ఎఫ్ఎస్ఎల్, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులను త్వరిత గతిన తెప్పించుకుని పరిష్కరించాలని ఆదేశించారు. కేసుల దర్యాప్తులో విషయంలో అధికారులు అందుబాటులో టెక్నాలజీతో పాటు, శాస్త్రీయ పద్ధతిను కూడా అనుసరిస్తూ దర్యాప్తు చేపట్టాలని సూచించారు. నేర నియంత్రణలో భాగంగా ప్రతి పట్టణంలోని కాలనీల్లో, గ్రామాలలో, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రమాదాల నివారణ కొరకు రోడ్డు భద్రతపై అవగాహన సమావేశాలు నిర్వహించాలని, గుట్కా, మట్కా, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిరంతరం నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. శక్తి కాల్స్ పై వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. పోలీస్ అధికారులు, సిబ్బంది క్రమ శిక్షణతో మెదులుతూ అంకితభావంతో విధులు నిర్వహించాలని, సమర్థ వంతమైన సేవల ద్వారా జిల్లా పోలీస్‌శాఖకు మంచి గుర్తింపు తీసుకురావాలని సూచించారు. నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వర రావు, డిఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మీ నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, రమణ కుమార్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, డిసిఆర్‌బి సీఐ దేవ ప్రభాకర్, ఐటి కోర్ సీఐ సూర్యనారాయణ, సీఐలు, ఎస్సైలు, తదితరులు పాల్గొన్నారు.



## రైజ్‌లో కియా మోటార్ కంపెనీ ప్రాంగణ ఎంపికలు

ఒంగోలు, మేజర్‌న్యూస్: స్థానిక వల్లూరు సమీపములోని రైజ్ కృష్ణ సాయి గ్రూప్‌ఆఫ్ ఇంజనీరింగ్ కళాశాలలో నేడు అపిత, రైజ్, ఏఆర్ఏఎస్ సంయుక్తంగా కియా కంపెనీ ప్రాంగణ ఎంపికలను నిర్వహించినట్లు కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలియచేశారు. ఈ ప్రాంగణ ఎంపికలకు ఏఆర్ఏఎస్ తరుపున హెచ్ఆర్ వెంకటేష్, మనీష్, అపిత తరుపున సత్య రత్నం, జనార్ధనరావు, మోహన్‌కృష్ణ బృందం కళాశాలకు విచ్చేసి రిజిస్టర్ అయిన 170 మంది విద్యార్థులను కలసి వారికి మొదటగా వ్రాత పరీక్షను, తరువాత టెక్నికల్ రౌండ్ నిర్వహించారు. ఈ రెండు రౌండ్స్ లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఎంపిక చేసి ఫైనల్‌గా కియా మోటార్స్ కంపెనీ హెచ్ ఆర్ ఉమాశంకర్ ఆన్లైన్ ద్వారా విద్యార్థులను ప్రశ్నలను అడిగి 48మందిని తుది జాబితాగా ఖరారు చేసారు. ఇందులో 42మంది రైజ్‌కళాశాల విద్యార్థులు, 6 మంది ఇతర కళాశాల విద్యార్థులు ఉన్నారు అని కళాశాల డైరెక్టర్ డాక్టర్ భాస్కర్ రావు తెలియచేశారు.ఎంపికైన విద్యార్థులు కియా ప్లాంట్ అనంతపూర్లో ట్రైనీగా తమ విధులను నిర్వహిస్తారని, వారికి వార్షిక వేతనం రూ.2,60,000 లు ఉంటుందని కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రఘు బాబు తెలియచేశారు. కియా మోటార్ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపిక అయిన విద్యార్థులను కళాశాల గౌరవ చైర్మన్ ఇస్మాల రంగమన్నార్, రాగా చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, ట్రైనర్లు అభినందించారు.

# అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలి: ఎంపిపి




భట్టిప్రోలు,మేజర్‌న్యూస్:మూడు నెలలకు ఒకమారు జరిగే మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశానికి మండల అధికారులు,ప్రజా ప్రతి నిధులు తప్పనిసరిగా హాజరుకా వాలని మండల పరిషత్ అధ్యక్షురాలు దావూరి వెంకట లలిత కుమారి అన్నారు. గురువారం జరిగిన సర్వ సభ్య సమావేశంలో యంపిపి మాట్లాడు తూ సమాచారం ఇవ్వకుండా మండల అధికారులు సమావేశానికి గైరుహాజరు అవడం పై ముఖ్యంగా వైద్య శాఖ నుండి అధికారులు హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు.అందరూ మండల అధికారులు ఆయా శాఖలలో జరుగుతున్న ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలను వివరించారు.వేసవి నేపథ్యంలో తాగునీటి ఎద్దడి రాకుండా అత్యవసర చర్యలు తీసుకోవాలని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ని,పంచాయతీ కార్యదర్శులను ఎంపీపీ ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల గురించి వాటి అమలు గురించి సర్పంచ్ లతో పాటు ఎంపీటీసీలకు తప్పనిసరిగా సమాచారం ఇవ్వాలని అధికారులను, పంచా ఓయతీ కార్యదర్శులను ఆదేశించారు. సమావేశంలో ఆయా పనులకు సంబంధించి తీర్మానం చేయడం జరిగిందని ఎంపీపీ తెలియజేశారు. ఈ సమావేశంలో జడ్పిటిసి తిరువీధుల ఉదయ భాస్కర్, ఎంపీడీవో ఎస్.వెంకటరమణ, డిప్యూటీ ఎంపీడీవో టి.ఉషారాణి,ఏవో సిహెచ్. జలజ,వైస్ ఎంపీపీ.కె పిచ్చియ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 95 శాతం పన్నులు వసూళ్లు చేసిన పురపాలక సంఘం



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల పురపాలక సంఘం పరిధిలోని ఆస్తి పన్ను ఖాళీ స్థలం పన్ను నీటి పన్నులు వసూళ్లకు కమిషనర్ కృషి ఫలించిందని చెప్పాలి. 2024- 25 సంవత్సరముల పన్నుల వసూళ్లలో 95% పూర్తి చేశారు.బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ గత మూడు సంవత్సరముల ఆస్తి పన్ను అక్షరాల ఒక కోటి 73 వేల రూపాయలను చెక్కు రూపంలో గురువారం మునిసిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి కి అందజేశారు. ఈ చెల్లింపు ద్వారా 2024-2025 ఆర్థిక సంవత్సరమునకు గాను బాపట్ల పురపాలక సంఘం పన్నుల వసూళ్లలో 95% అధిగమించింది. ఈ విషయమై కమిషనర్ మాట్లాడుతూ సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు అయినందుకు పురపాలక సంఘ ప్రజలకు మునిసిపల్ కమిషనర్ కృతజ్ఞతలు తెలిపారు. పన్నుల వసూళ్లలో సహకరించిన సిబ్బందికి అభినందనలు తెలిపారు.

## గొప్ప తత్వవేత్త సర్వేపల్లి



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: భారతీయ తత్వశాస్త్ర విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ అని కొనియాడారు బాపట్ల ఫోరం ఫర్ బెటర్ కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు. డాక్టర్ సర్వేపల్లి 50 వ వర్ధంతి సందర్భంగా గురువారం ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద గల ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఫోరం సభ్యులు పట్టణ ప్రముఖులు. ఈ సందర్భంగా ఫోరం కార్యదర్శి డాక్టర్ పిసి సాయిబాబు మాట్లాడుతూరాష్ట్రపతి పీఠాన్ని అధిష్టించి, భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారని, ఆయన రచించిన గ్రంథాలు అజరామరమైనవి. భారత రత్న పురస్కారాన్ని అందుకొని, ఉపాధ్యాయులకు ఎనలేని ఖ్యాతిని ఆర్జించి పెట్టారు. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి, అత్యున్నత స్థానానికి చేరుకోవడంలో ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమైనది. యునెస్కో అధ్యక్షుడిగా పని చేసి, దేశ ఖ్యాతిని దశదిశలా చాటారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది జమ్మద్ బాషా, సాహితీ భారతి అధ్యక్షులు రావూరి నరసింహ వర్మ, అబ్రహం లింకన్, అబ్దుల్ రషీద్, డేనియల్, చంద్రబాబు,రాజు, ముత్యాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మోహన్ గౌడ్‌కు శుభాకాంక్షలు తెలిపిన విన్నకోట



బాపట్ల, మేజర్‌న్యూస్: బిజెపి సీనియర్ బిసి నాయకుడు అఖండ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షుడు జివిఎల్ మోహన్ గౌడ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు జనసేన పార్టీ నాయకుడు అఖండ ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్. బుధవారం ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు జివిఎల్ మోహన్ గౌడ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఫౌండేషన్ కుటుంబ సభ్యుల మధ్య కేక్ కటింగ్ కార్యక్రమం విన్నకోట సురేష్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షులు విన్నకోట సురేష్ మాట్లాడుతూ మాకు ఎంతో ఆత్మీయులు ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు బిజెపి సీనియర్ నాయకులు మోహన్ గౌడ్ బాపట్ల ప్రాంత ప్రజలకు ఎంతో సుపరిచితులు అటు పార్టీకి ఇటు ఫౌండేషన్ కి అనేక సేవలను అందిస్తున్నారని వారి జన్మదినం సందర్భంగా ఫౌండేషన్ సభ్యుల మధ్య జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని వారి సేవలను కొనియాడారు. మోహన్ గౌడ్ మాట్లాడుతూ బాపట్ల నియోజకవర్గంలో అఖండ ఫౌండేషన్ సేవలను ప్రజలకు మరింత చేరువ కావాలని ఆ దేవదేవుని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు తెలిపారు. పుట్టిన రోజు సందర్భంగా ఫౌండేషన్ సభ్యులు, మిత్రులతో కలిసి విన్నకోట సురేష్ ఆధ్వర్యంలో వేడుకలను జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందని. తనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అఖండ ఫౌండేషన్ సభ్యులు పులిగడ్డ శ్యాంప్రసాద్, గొర్ల ఆంజనేయులు, చేజర్ల సతీష్, ఆరుమళ్ళ సుధాకర్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా మోర్ల కోటేశ్వరరావు

భట్టిప్రోలు,మేజర్‌న్యూస్: భట్టిప్రోలు మండల వై సి పి ప్రధాన కార్యదర్శి గా భట్టిప్రోలు గ్రామా నికి చెందిన మోర్ల కోటేశ్వరరావు నియమితులైయ్యారు.తన నియమకానికి కారకులైన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి,వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబును మర్యాద పూర్వకంగా కలిసి ధన్యవాదములు తెలిపారు.మోర్ల కోటేశ్వరరావును అశోక్ బాబు సత్కరించి పార్టీ పటిష్టతకు కృషి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో యం పిపిడి లలితకుమారి, కోఫషన్ సభ్యులు నబి, అంకబాబు,ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగాలకు 25 మంది ఎంపిక



నగరం, మేజర్‌న్యూస్: హైదరాబాద్ దివీస్ లాబొరేటరీస్ వారు తమ లాబ్స్‌లో ఉద్యోగాలకు స్థానిక శ్రీ వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలో 80 మంది నిరుద్యోగ యువత పాల్గొనగా 25 మందిని ఎంపిక చేశారు. ప్రతి సంవత్సరం ఇదే లేబొరేటరీవారు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తూ యువతకు మార్గదర్శకులుగా నిలుస్తున్నారని ఉద్యోగానికి ఎంపికైన విద్యార్థులను, ఎంపిక చేసిన హెచ్‌ఆర్ రామ కృష్ణలను సెక్రటరీ కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సి పల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వి. వెంకటే శ్వరరావు, సూపరింటెండెంట్ అమరేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పురపాలక, సచివాలయ సిబ్బందికి మనమిత్రపై అవగాహన



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల పురపాలక సంఘ కార్యాలయము కౌన్సిల్ హాల్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రియల్ టైం గవర్నెన్స్ ద్వారా సేవలు అందించు మనమిత్ర (వాట్సాప్ గవర్నెన్స్) ప్రజల చేతిలో ప్రభుత్వం వాట్సాప్ అప్లికేషన్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించు విషయమై ముందుగా బాపట్ల పురపాలక సంఘ సిబ్బందికి, సచివాలయ సిబ్బందికి మునిసిపల్ కమిషనర్ జి.రఘునాథ రెడ్డి అవగాహన కల్పించారు. ప్రభుత్వం అందించు సేవలను సులభతరం చేస్తూ ఏర్పాటు చేసిన వాట్సాప్ నెంబర్ అయి నటువంటి 9552300009 ద్వారా ప్రభుత్వం అందించు సేవలను సులభతరంగా పొంద వచ్చు అని కమిషనర్ అన్నారు. మనమిత్ర వాట్సప్ గవర్నెన్స్ సేవలను ప్రజలు అవగాహన కలిగించుకొని ప్రభుత్వం అందించు ధ్రువీకరణ పత్రాలను, ప్రభుత్వ బిల్లులను సులభంగా చెల్లించవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ ఎస్.ఎస్. కృష్ణారెడ్డి, పట్టణ ప్రణాళిక అధికారి ఎన్.మల్లికార్జున రావు,మేనేజర్ పి.లక్ష్మయ్య, మెప్మా సీ.ఎం.ఎం నగ్రా.సుబ్రహ్మణ్యం, పురపాలక సంఘ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కోనకు కావూరి స్వీట్ వార్నింగ్



బాపట్ల, మేజర్‌న్యూస్: మైకు చేతిలో ఉంది కదా అని ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదని తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి బాపట్ల మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి కి స్వీట్ వార్నింగ్ జారీ చేశారు. తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 27 వేల ఓట్ల మెజార్టీతో గెలుపొందిన ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ పై విమర్శలు చేయడం మానుకొని మీ పార్టీకి దూరమైన ఓటర్లను దగ్గర చేసుకునేందుకు ప్రయత్నించి పార్టీని బలోపేతం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. దేశం కోసం అసువులు బాసిన జస్వంత్ రెడ్డి విగ్రహాన్ని పట్టణంలో ఏర్పాటు చేయనీయకుండా అడ్డుకున్న ఘనత మీకే దక్కుతుందని అన్నారు. రెడ్డి సామాజిక వర్గాన్ని నియోజకవర్గంలో అణచివేయడానికి పాల్పడింది మీరు కాదా అని ప్రశ్నించారు. బాపట్ల మండలం ఓసి అయితే ఎస్టీ చేయిం చింది మీరు కాదా అని ప్రశ్నించారు. తెలుగుదేశం పార్టీ విజయం కోసం 9 సంవత్సరాలు కష్టపడి పని చేశారని అటువంటి వ్యక్తికి ప్రజలు పట్టం కట్టారని ఈ విజయం కూటమి విజయమని అన్నారు. ఓడిపోయామని ఈర్షతో ఏదేదో మాట్లాడితే కుదరదని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయ కులు తానికొండ దయా బాబు,ఐదుగు నాగభూషణం, పసుమర్తి యలమంద, శీలం శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## సిబ్బందిని సన్మానించిన కమిషనర్



బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల పురపాలక పరిధిలో 95% పన్నులు అధిగమించిన సందర్భంగా రెవెన్యూ సిబ్బంది జబ్బార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఇమామ్ పురపాలక కమిషనర్ జి రఘునాథరెడ్డి ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. బాపట్ల పురపాలక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## బాల్యవివాహాలను అరికట్టాలి: సిడిపిఓ అనసూయ



నిజాంపట్నం, మేజర్‌న్యూస్: ఆడపిల్లలకు 18, మగవారికి 21 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయరాదని పల్లపట్ల ఐసిడిఎస్ సెక్టార్ ప్రాజెక్టు సిడిపిఓ అనసూయ తెలియజేశారు. మండల కేంద్రమైన నిజాంపట్నం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాల్య వివాహాల నిరోధక కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి, ఎంఈఓ లు శోభాచంద్, శేషగోపాలం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనసూయ మాట్లాడుతూ బాల్యవివాహాల కమిటీ పటిష్టంగా పనిచేసి గ్రామాలలో బాల్యవివాహాలు బాలికల అక్రమ రవాణా బాల కార్మికులకు స్కూలు మానివేసిన పిల్లలను తిరిగి ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా పనిచేయాలన్నారు. అదేవిధంగా ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ అంగన్వాడీ కార్యకర్తలు ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే విధంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య www.suryaa.com
PRAKASAM ప్రకాశం BAPATLA బాపట్ల

## కిల్కారి సేవలు గర్భిణీకి వరాలు: డిఎంహెచ్‌వో



బాపట్ల, మేజర్‌న్యూస్: కేంద్ర ప్రభుత్వం కిల్కారి ప్రోగ్రాం ను గర్భిణీ స్త్రీ లు, బాలింతలు కొరకు ప్రవేశపెట్టారని తెలిపారు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిని డాక్టర్ ఎస్ విజయమ్మ. బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో కిల్కరి సేవలు పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రకటన విడుదల చేశారు. గర్భిణీలకు 4 వ నెల మొదలుకొని బిడ్డ కు ఏడాది వరుకు కిల్కారి కాల్స్ వస్తాయి. వాయిస్ కాల్స్ వారినికి ఒక సారి వస్తాయి, వచ్చి తల్లీ బిడ్డ ల ఆరోగ్య క్షేమ సమాచారిని అందజేస్తుందని. కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చే కిల్కారి కాల్ నెంబర్ 01244451660 ఈ నెంబర్ ని గర్భిణీ మొబైల్ లో సేవ్ చేసుకున్నట్ల అయితే కాల్ వచ్చినపుడు పూర్తిగా సమాచారాన్ని వినగలుగుతారు. ఒక వెళ్ళ మరల తిరిగి ఆ సమాచారాన్ని వినాలి అంటే 14423 అనే టోల్ ఫ్రీ నెంబర్ కి చేసి వినవచ్చు. ఈ కిల్కారి సేవలను గర్భిణీలు, బాలింతలు ఉపయోగి%శీ%చుకోవాలిని కోరారు.కిల్కారి గురించి ఇంకా ఏదైనా సమాచారం కావాలి అంటే కిల్కరి ప్రోగ్రాం ఆఫీసర్ రాజు, 7993296970 ను సంప్రదించగలరు అని తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా వెంకటకుమారి



గిద్దలూరు, మేజర్‌న్యూస్: ప్రకాశం జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ పగడాల వెంకట కుమారి నన్ను నియమించినందుకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున కార్గే సోనియా గాంధీకి, రాహుల్ గాంధీకి, వైయస్ షర్మిల రెడ్డికి, డిసిసి అధ్యక్షులు సైదాకి, గిద్దలూరు ఇంచార్జ్ రంగస్వామికి కృతజ్ఞతలు తెలియజేశారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో గత పూర్వం నుండి మా కుటుంబంలో పగడాల రామయ్య చిన్న మామ డిసిసి అధ్యక్షులుగా ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన కాంగ్రెస్ పార్టీ వారసత్వంలో పని చేస్తున్నామన్నారు. గతంలో సుధాకర్ రెడ్డి డిసిసి ఉన్న టైంలో జిల్లా సెక్రెటరీగా పని చేసిన గతంలో కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. మా కుటుంబం గత 35 ఏళ్ల నుండి మా భర్త కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్నారు. కష్టకాలంలో కాంగ్రెస్ పార్టీని వదిలి పెట్టకుండా పనిచేస్తున్నాం జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## 19న ఉచిత కంటి వైద్యశిబిరం

### మండల ప్రజలకు డాక్టర్ వెంగయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు





సి.ఎస్.పురం, మేజర్ న్యూస్: ఈ నెల 19వతేది శనివారం రాష్ట్ర ముఖ్య మంత్రి, స్వర్ణాంధ్ర ప్రదేశ్ రథసారథి, టిడిపి జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబునాయుడు పుట్టినరోజును పురస్కరించు కుని కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్వర్యంలో జననీ చారిటబుల్ ట్రస్ట్ శంకర్ కంటి ఆసుపత్రి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో కనిగిరి అమరావతి గ్రౌండ్స్ నందు ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల టిడిపి అధ్యక్షుడు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు(వెంగయ్య) ప్రధానకార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 19వతేది శనివారం కనిగిరి అమరావతి గ్రౌండ్స్ నందు ఉదయం 9గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు ప్రముఖ కంటివైద్య నిపుణులచే వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శంకర కంటి ఆస్పత్రి నందు కంటి ఆపరేషన్లు చేయిస్తారని కంటి సంబందిత వ్యాధిగ్రస్థులు ఉచిత కంటి వైద్యశిబిరం ఉపయోగించుకోవాలని అదేవిధంగా గతంలో కంటి ఆపరేషన్ చేయించుకున్న వారికి కంటి అద్దాలు పంపిణీ చేస్తున్నట్లు కంటి వ్యాధిగ్రస్థులు సంభదిత ఫోటోగుర్తింపు కార్డు, ఆధార్, రేషన్, ఆరోగ్యశ్రీ, ఫోన్ నెంబర్ వెంట తీసుకురావాలని బొమ్మనబోయిన వెంగయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు తెలిపారు.

## సెల్ టవర్ బ్యాటరీలు చోరీ




ముండ్లమూరు, మేజర్‌న్యూస్: సెల్ ఫోన్ టవర్‌లోని బ్యాటరీలు చోరికి గురి అయ్యాయి. శంకరాపురంలో సెల్ ఫోన్ టవర్‌లో బ్యాటరీలు చోరికి గురి అయ్యాయి. 24 బ్యాటరీ లను దొంగలు ఎత్తు కెళ్లారు. వీటి విలువ సుమారు రెండు లక్షల రూపాయలు ఉంటాయని, దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు జియో కంపెనీ ప్రతినిది అంజయ్య తెలిపారు.

# వెట్టిచాకిరిపై సమగ్ర విచారణ జరిపించాలి




భట్టిప్రోలు, మేజర్‌న్యూస్: సంవత్సరాల తరబడి వెట్టి చాకిరి చేయించుకుంటూ అమ్మకాలు చేసిన వారిపై సమగ్ర విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించడంతో పాటు కుటుంబాల వారికి విముక్తి కల్పించాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పి నాగాంజనేయులు డిమాండ్ చేశారు.గురువారం భట్టిప్రోలులో ని సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేపల్లె రూరల్ మండలం బొబ్బర్లంక ఎస్టి కాలనీకి చెందిన నంబూరు పద్మ,ఆమె భర్త అగ్ని 15 సంవత్సరాల క్రితం ఎలిసెట్టి దిబ్బ గ్రామానికి వెళ్లగా చెన్ను కోటేశ్వరరావు,చెన్ను వెంకటేశ్వర రావు,చెన్ను ఏగేసు,చెన్ను అశ్వేశ్వరరావులు లక్షల రూపాయలకు మనుషుల ను అమ్మకాలకు గురిచేస్తూ సుమారు 50 కుటుంబాల వారితో వేట్టి చాకిరీ చేయించుకుంటూ లక్షలాది రూపాయలు సంపాదించుకుం టున్నా రని నాగాంజ నేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా కుటుంబాల వారిని ఎలిసేట్టి దిబ్బలో నిర్బంధించి వెట్టి చాకిరి చేయించుకోవడంతోపాటు ఎవరైనా తమ మాట వినకపోతే చావ బాదుతున్నారని నాగాంజనేయులు ఆరోపించారు.ఒకవైపు వెట్టి చాకిరి వ్యవస్థను నిర్మూలిస్తామంటూ అటు ప్రభుత్వం,ఇటు అధికారులు చేస్తున్న ప్రచారం పత్రికలకే పరిమితం అవుతున్నాయా?అని ఆయన ప్రశ్నించారు. 1976లో వేట్టిచాకిరి వ్యవస్థ రద్దు చట్టం ఏర్పడినప్పటికీ ఆచరణలో ఆచట్టం కఠినంగా అమలు చేయడంలో పాలక ప్రభుత్వాలు విఫలం చెందాయని నాగాంజనేయులు విమర్శించారు.ఎలిసెట్టిదిబ్బలో వేట్టిచాకిరి చేయుస్తున్న వ్యక్తులపై సమగ్ర విచారణ చేపట్టి వేట్టిచాకిరిలో మగ్గుతున్న కుటుంబాలకు విముక్తి కల్పించాలని లేకుంటే సిపిఐ ఆధ్వ ర్యంలో దశలవారి ఆందోళన కార్యక్ర మాలను చేపట్టనున్నట్లు నాగాంజనే యులు హెచ్చరించారు.ఈ సమావేశంలో రేపల్లె,వేమూరు నియోజకవర్గాల సిపిఐ కార్యదర్శులు గొట్టు ముక్కల బాలాజీ, బండారు శ్రీనివా సరావు, ఎఐటియుసి నాయకులు జి. శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సమిష్టి కృషి అవసరం: ఎంఈఓ మస్తాన్ నాయక్



పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని అయినముక్కల ఎస్సీ అంగన్వాడి కేంద్రం (కోడ్ నెం.135)లో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బి.మస్తాన్ నాయక్ పాల్గొన్నారు. కేంద్రాన్ని సందర్శించిన ఎం.ఈ.ఓ, అక్కడ ప్రీ-స్కూల్ పూర్తిచేసిన 18 మంది చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. విద్యారంభ దశలోనే పిల్లలకు ప్రోత్సాహం అందించేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాన్ని అభినందించిన ఆయన, అంగన్వాడి కార్యకర్త జడి లక్ష్మమ్మను ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా బి.మస్తాన్ నాయక్ మాట్లాడుతూ ఐదు సంవత్సరాల పైబడి ప్రైవేటు పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల వివరాలను అంగన్వాడి కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు కలిసి సేకరించి, వారి తల్లిదండ్రులతో చర్చించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వచ్చే విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు సమిష్టిగా కృషి చేయాలనే ఉద్దేశంతో జరుగుతున్న ఈ కార్యక్రమం మంచి స్పందన అందుకుంది. కార్యక్రమంలో కాంప్లెక్స్ చైర్మన్ మరియు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.అనసూయ దేవి, హెడ్మాస్టర్ గొల్లపూడి నాగభూషణం, అంగన్వాడి కార్యకర్త జడి లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలో వేసిన పునాదులే అద్భుత ఫలితాలు



Ch.Sruthi( MPC) 981/1000 | V.Mounika( MPC) 974/1000 | S.G.S pradeep ( MPC) 961/1000 | K.Nikhitha( BiPC) 958/1000 | B.Hasini( MPC) 434/470 | Ch.Sowjanya( MPC) 451/470 | Md.Nihal Ahmad ( MPC) 454/470 | G.Hemalatha( MPC) 464/470 | U.Yamuna ( MPC) 452/470 | G.Supraja ( BiPC) 400/440 | Y.Jyothi Varshitha ( MPC) 430/470 | A.Raja Apareswar( MPC) 434/470

నగరం, మేజర్‌న్యూస్: మండల పరిధిలోని ఈదుపల్లి ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీషు మీడియం పాఠ శాల పూర్వ విద్యార్థులు ఇంట ర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ పరీక్షా ఫలితాల్లో అద్భుత ఫలి తాలు సాధించారు. 9,10 తరగ తుల్లో ఈ పాఠశాలలో వేసిన పునాదులే అద్భుత ఫలితాలు సాధించగలి గామని విద్యార్థులు చెప్పారు. పాఠశాల డైరెక్టర్ యోనాబాబు మాట్లాడుతూ నిత్యం విద్యా వ్యవస్థలో చోటు చేసికొంటున్న మార్పులకు అనుగుణంగా పాఠశాల స్థాయిలోనే విద్యార్థుల్లో దాగివున్న ప్రతిభను బయటికి తెచ్చేందుకు వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్, స్పెల్‌బీ లాంటి పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. మండల, జిల్లా స్థాయిలో టాలెంట్ పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు పాల్గొనేవిధంగా ప్రోత్సహించటంతో పాటు జాతీయ స్థాయిలో మోటివేషనల్ స్పీకర్లచే పలు సందేశాలు ఇప్పించటంతో వీరిలో ఇంతటి గణనీయమైన మార్పుకు దోహదపడిందన్నారు. గత విద్యా సంవత్సరంలో ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి యుఎల్ఐపిఎస్‌య అనే స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ప్రారంభించామని, కంప్యూటర్ ల్యాబ్, ఐఐటి, నీట్ ఫౌండేషన్ సిలబస్‌లతోపాటు డిజిటల్ స్క్రీన్ ద్వారా ప్రత్యేక బోధనతో సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేలా విద్యాబోధన చేస్తున్నామన్నారు.



## ప్రభుత్వ బడులకు పిల్లలను పంపండి

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: మండలంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల చిన్న దోర్నాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఎన్రోల్మెంట్ డ్రైవ్‌లో భాగంగా చిన్న దోర్నాలలోని ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులతో మన పాఠశాల ప్రత్యేకతను వివరిస్తు, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాల గురించి తెలియజేస్తూ, మన ఊరి బడిని మనం కాపాడుకుందామని, మీ పిల్లల భవిష్యత్‌కి మాది గ్యారెంటీ అని, గ్రామంలోని ప్రతి ఒక్కరూ అలోచించి మన పాఠశాలలో విద్యార్థులను చేర్చి మాకు సహకరించాలన్నారు.

## డ్రోన్లతో పట్టణంపై పోలీసుల నిఘా




చీరాల, మేజర్‌న్యూస్: పట్టణంలోని ట్రాఫిక్, నేర నియంత్రణపై పోలీసులు వినూత్న ఆలోచన చేపట్టారు. డ్రోన్‌లు ఎగరవేస్తూ వాటి సాయంతో పట్టణాన్ని జల్లెడ పట్టేందుకు సిద్ధమయ్యారు. గురువారం రాత్రి ఒకటవ, రెండవ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రధాన సెంటర్లలో డ్రోన్ యంత్రాలను ఒకటో పట్టణ సిఐ సూరేపల్లి సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ రద్దీ ప్రాంతాల్లో ట్రాఫిక్ ను అరికట్టేందుకు, మద్యం, గంజాయి సేవించి వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు డ్రోన్ల నిఘాను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వన్ టౌన్, టూ టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పి జి ఆర్ ఎస్ గ్రీవెన్స్ వేదిక తాత్కాలిక మార్పు

బాపట్ల, మేజర్‌న్యూస్: బాపట్ల జిల్లా కలెక్టరేట్ నందు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ సెల్ వేదికను తేది:21.04.2025న సోమవారం నాడు, చీరాల నియోజకవర్గంలోని చీరాల మునిసిపల్ కమీషనర్ కార్యాలయంలో నిర్వహించనున్నారు. కావున, బాపట్ల జిల్లా ప్రజలు ఈ విషయమును గమనించి తమయొక్క సమస్యలను లిఖిత పూర్వకంగా రాసి అర్జీలను చీరాల మునిసిపల్ కమీ షనర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కు అందించాలని కోరారు.

# గీత కార్మికుల బతుకులకు ఏదీ భరోసా?





నిజాంపట్నం, మేజర్‌న్యూస్: త్రేతాయుగం నుండి దేవతలు సైతం కల్లును సురాపానకంగా స్వీకరించి ఆనందాన్ని వ్యక్తీకరించి తన్మయత్వాన్ని పొందేవారు. సమాజంలో ప్రతి రంగంలో రోరోజుకి ఎన్నో మార్పులు చోటుచేసుకుని నవ శకానికి నాంది పలుకుతుంటే ఒక్క గీత కార్మికుల బతుకులో మాత్రం మార్పు లేకపోవడం బాధాకరం. పాలకుల ప్రభుత్వాలు మారిన గీత కార్మికుల జీవన విధానంలో విలక్షణమైన మార్పులు రావడం లేదు. ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని బతుకు పోరాటమే భవితగా ముందుకు సాగుతున్న ఈ జాతికి భరోసా ఇచ్చేవారు ఎవరు? తరాలు మారుతున్న గీత కార్మికుల తలరాతలు మారడం లేదన్న దానికి ఎన్నో సంఘటనలు మనమందు కదులుతున్నాయి. రెక్కాడితే గాని డొక్కాడని వీరి జీవితాలు ప్రతిక్షణం కత్తి మీద సాము లాంటివి. ఆత్మగౌరవం తోడుగా ధైర్యమే దోస్తీగా కులవృత్తి జీవన భృతిగా సాగుతున్న వీరి బతుకులకు రక్షణ కరువైందని చెప్పవచ్చు. ఎన్నికల సమయంలో స్వార్థపూరిత ఆలోచనలతో అవసరానికి వాడుకునే ఆట బొమ్మల మాదిరిగా చూస్తూ గీత కార్మికుల ఓట్లు కోసం పాకులాడే పాలకులు తప్ప గౌడ్ న్న సంక్షేమానికి దారి చూపేవారు కానరారు. జీవోల పేర్లతో, సర్క్యులర్ల సాకుతో, కాలక్రమంగా గీత వృత్తి ఉనికిని దూరం చేస్తున్నారే తప్ప వృత్తి పరిరక్షణకు ఉపాధి కల్పనకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు అనడంలో సందేహం లేదని చెప్పవచ్చు. అధికారుల, పాలకుల అండతో అగ్రవర్ణాల ఆగడాలతో అమాయకపు గీత కార్మికుల జీవితాలను చిన్న భిన్నం చేస్తున్న వారిపై చర్యలు తీసుకునే నాదుడే లేడు. వివిధ కార్యక్రమాల పేర్లుతో వృత్తి పరిరక్షణ ప్రచారం పేరుతో తాటి ,ఈత వనాలు పెంచుతామని చెప్తూనే, వాటి పర్యవేక్షణ బాధ్యతను గాలికి వదిలేసి గీత కార్మికుల పట్ల పాలకులు నిర్లక్ష్యపు వైఖరిని ప్రదర్శిస్తున్నారు. అంత భూములలో ఉన్న తాటి, ఈత చెట్లను కొంతరుసుం చెల్లించి తొలగించుకోవచ్చునే నిబంధన గౌడ్ న్న జీవనోపాధికి బీటలు పారేలా చేస్తుంది. ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుండి పడి దుర్మరణం చెందిన గీత కార్మికుల ఎక్స్ గ్రేషియా మంజూరు విషయంలో కూడా నిమ్మకు నీరెత్తినట్లు ఉండటమే చేస్తుంది. సంవత్సరాలు గడుస్తున్నా కుటుంబంలో ఎవరి తోడు లేక, బాధ్యతాయుమైన వ్యక్తి లేఖ ఎంతోమంది గీత కార్మికుల కుటుంబాలకు ఇప్పటివరకు కూడా ఎక్స్గ్రేషియా రాకపోవడం దురదృష్టకరం. ఇప్పుడు రాష్ట్రంలో ఉన్న ఈత, తాటి వనరులకు రక్షణ దిక్కులేదు కానీ కొత్త వనరుల పెంపు కార్యక్రమాలు రూపొందించడం హాస్య పదం అని చెప్పవచ్చు. నిర్లక్ష్యపు నీడలు వెంటాడుతూ నిరుపేద గౌడ్ అన్నల జీవితాలు అగమ్య గోచరంగా మారిన ప్రభుత్వాల మనస్సు మారడం లేదు. బడుగు బలహీన వర్గాలలో అధిక జనాభా కలిగిన గీత కార్మికుల సంక్షేమానికి ఒక ప్రత్యేకమైన కార్యాచరణ రూపొందించి గౌడ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. గీత కార్మికుల కుటుంబంలో ఉన్న యువతకు ఉపాధి కల్పన కోసం తాటి టాపర్ బోర్డు ఏర్పాటు చేసి తాటి ఈత సంబంధిత పదార్థాల ఉత్పత్తిని చేపట్టాలి, పకృతి సిద్ధంగా, సహజంగా లభించే కల్లును మార్కెట్లో అందుబాటులో ఉంచి వాణిజ్య పరిశ్రమగా అభివృద్ధి చెందేలా చర్యలు తీసుకోవాలి. తాటి ఈత ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేసి గీత కార్మికుల జీవనోపాధికి ప్రతిష్టమైన కార్యక్రమాలు, పథకాలు రూపొందించాలి. వృద్ధులైన గీత కార్మికులకు తగిన మొత్తంలో పింఛన్లు ఇవ్వాలి. తాటి ఈత వనరుల పెంపకానికి సంబంధించి మరుగుజ్జు రకానికి చెందిన రకాలపై దృష్టి సారించాలి. ప్రమాదవశాత్తు తాటి చెట్టు పై నుండి పడి మరణించే పరిస్థితిని రూపుమాపడానికి నిర్ణయాత్మక ఆలోచనతో తాడిచెట్టు ఎక్కే యంత్రాలను ప్రభుత్వం తీసుకోరవడం జరిగింది కానీ వాటిని పూర్తిస్థాయిలో రాష్ట్ర మొత్తంలో ఉన్న గీత కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలి. పూర్తిస్థాయిలో అన్ని గ్రామాలకు సేఫ్టీ మొకులను అందించేలా ప్రణాళికలు రూపొందించి నిర్మాణాత్మకమైన శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టీవీఎస్ మోపెడ్లు కొనుగోలు చేసి ఇవ్వాలి. కుటుంబాలు గడవడం కష్టంగా మారి ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడతూ కులవృత్తినే నమ్ముకుని జీవిస్తున్న ఎండిన తాటి,ఈత, వనాలతో కల్లురాక నానా ఇబ్బంది పడుతున్న గీత కార్మికులకు గౌడ స్వయం ఉపాధి సంఘాలు ఏర్పాటు చేసి వారికి ఉపాధి కల్పించాలి. బెల్టు షాపుల దెబ్బకు కల్లు అమ్ముడు పోక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న పరిస్థితులు పాలకులు ఆలోచన చేయాలి. కొత్త ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి గీత కార్మికుల సంక్షేమానికై ఒక్క నూతన పథకం కూడా అమలు చేయడం లేదని గౌడ్ అన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా గీత వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గీత కార్మికులు చస్తేతప్ప బతకడానికి పథకాలు ఏమీ లేవు. తాటి చెట్లు ఎక్కి కల్లు గీసుకునే గీత కార్మికులు ప్రమాదవశాత్తు పడి మరణిస్తే శాశ్వత అంగవైకల్యం పొందిన వారికి ప్రభుత్వం 5 లక్షల బీమా నుండి 10 లక్షల వరకు వర్తింపజేయాలి. గీత వృత్తిని అభివృద్ధి చేసేందుకు సబ్సిడీ పథకాలు రూపొందించడంలో ప్రభుత్వం గౌడ కులస్తులను విస్మరించి పరిస్థితి మారాలి. ఎప్పటికైనా పాలకులు గౌడ్ అన్న బతుకులకు భరోసా ఇచ్చే కార్యక్రమాలు రూపొందించాలని కల్లు గీత కార్మికులు కోరుచున్నారు.

## తప్పిపోయిన బాలుడు సురక్షితం

పెద్ద దోర్నాల, మేజర్‌న్యూస్: స్థానిక సుందరయ్య కాలనీలో గురువారం ఉదయం ఆరేళ్ల బాలుడు వెంకటేశ్వర్లు(6 సంవత్సరాలు) బాలుడు మూగ, చెవుడు కలిగిన అంగవైకల్యం కలవాడు కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు లోనయ్యారు. వెంటనే బాలుడి తండ్రి పెద్దదోర్నాల పోలీసులకు ఫిర్యాదు చేయగా, పెద్ద దోర్నాల ఎస్ఐ వి.మహేష్, వారి సిబ్బంది ఏ.ఎస్.ఐ. వెంటనే స్పందించి బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. సాంకేతిక ఆధారాలు సాయంగా, ముఖ్యంగా పరిసర ప్రాంతాల్లోని సీసీ టీవీ ఫుటేజ్‌లను గమనంగా పరిశీలించిన పోలీసులు, బాలుడిని బస్టాండ్ సమీపంలో గుర్తించి అక్కడికి వెళ్లారు. బాలుడిని సురక్షితంగా స్వాధీనం చేసుకొని అతని తల్లిదండ్రులకు సమాచారం అందించి బాలుడిని అప్పగించారు. బాలుడు క్షేమంగా ఇంటికి తిరిగి రావడంపై తల్లిదండ్రులు హృదయ పూర్వకంగా పోలీసులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దదోర్నాల ఏఎస్ఐ రమణారెడ్డి, శ్రీనివాసులు, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బధిరుల ఆశ్రమ పాఠశాల ప్రవేశాలకు దరఖాస్తులు

బాపట్ల రూరల్, మేజర్ న్యూస్: బాపట్ల మండలం, వెదుళ్ళపల్లి సమీపం, జి.బి.సి రోడ్డు ప్రక్కన వంతెన దగ్గర గల ప్రభుత్వ బధిరుల ఆశ్రమ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి గాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తునట్లు ప్రిన్సిపాల్ డి.ఎస్ రజియా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాలబాలికలకు ప్రత్యేకమైన హాస్టల్ ఉందని, రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారు పాఠశాలలో ప్రవేశానికి అర్హులన్నారు. 1వ తరగతిలో చేరేందుకు 6 సంవత్సరాల నుంచి 8 ఏళ్ల మధ్య వయస్సు ఉండాలన్నారు. బదిలీ సర్టిఫికేట్ పై అన్ని తరగతులకు ప్రవేశం ఉందన్నారు. అయితే వినికిడి లోపం ఉన్నట్లు సదరం సర్టిఫికేట్, పాఠశాల బదిలీ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ పాస్బుక్ మొదటి పేజీ జిరాక్స్ కాపీతో తమ పాఠశాలలో సంప్రదించాలన్నారు. ఉచిత విద్య, హాస్టల్, భోజనంతో పాటు ప్రభుత్వం కల్పించే అన్ని రకాల సదుపాయాలు ఉచితంగా కల్పిస్తున్నారు, సుశిక్షితులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన, అత్యాధునిక సంకేతిక పరిజ్ఞానంతో చదువు నేర్పుతున్నట్లు పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం 10వ తరగతి ఇంటర్మీడియట్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాదిస్తున్నారు. ఆసక్తిగల బధిర (మూగ, చెవిటి) విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు సంప్రదించవలసిన సెల్ నెంబర్లు 9000013633, 9948372899, 9246143193.

## తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి



బాపట్ల మేజర్ న్యూస్: రాష్ట్రంలో ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వప్రధాన కార్యదర్శి కె. విజయా నంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. గురువారం అమరావతి సచివాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి త్రాగునీరు, ఇసుక సరఫరా, స్వచ్ఛఆంధ్ర, సోలార్ విద్యుత్తు,పరిశ్రమల స్థాపన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు ,జిల్లా ఎస్.పిల తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలకు ఎక్కడ కూడా త్రాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలో త్రాగునీటి ట్యాంకులకు ఈనెల 20 తేదీలోగా నీటిని నింపుకోవాలని ఆయన అధికారులకు చెప్పారు. రాష్ట్రంలో పశువులకు అవసరమై న తాగునీటి తొట్టిలను నిర్మించడా నికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు చెప్పారు.రాష్ట్రంలో ప్రజలకు ఇసుక కొరత లేకుండా సిద్ధం చేసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు.మన రాష్ట్రం నుండి ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమరవాణా కాకుండా ప్రత్యేక చెక్ పోస్ట్ లు, పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఇసుక రవాణా గురించి జిల్లా కలెక్టర్లు జిల్లా ఎస్పీలు ప్రతి 15 రోజులకు ఒకసారి సమీక్షించుకోవాలని ఆయన చెప్పారు. రాష్ట్రంలో సోలార్ ప్రాజెక్టులు నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ చేపట్టడా నికి చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లాకలెక్టర్ తో పాటు జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, గనుల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజేష్ , బాపట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి పి. గ్లోరియా, చీరాల రెవెన్యూ డివిజనల్ అధికారి చంద్రశేఖర్, రేపల్లె రెవిన్యూ డివిజనల్ అధికారి రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై విద్యార్థులకు అవగాహన



బాపట్ల,మేజర్‌న్యూస్: అగ్నిమాపక వారోత్సవాలు- 2025 లో బాగంగా నాలుగోవ రోజు గురువారం బాపట్ల పట్టణంలోని బాపట్ల పబ్లిక్ స్కూల్ నందు బాపట్ల అగ్నిమాపక కేంద్రం అధికారి ఆధ్వర్యంలో సిబ్బంది అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ అగ్నిమాపక కేంద్రాధికారి వై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ స్కూల్ పిల్లలకు, అధ్యాపక సిబ్బందికి అగ్ని ప్రమాదాల గురించి నివారణ పద్ధతుల గురించి అవగాహన కల్పించడం జరిగిందని, వాటర్ డెమో, ఫోమ్ డెమో, ప్రకృతి విపత్తుల వలన జరిగే ప్రమాదముల గురించి వివరించి, వారికి డెమో చూపించి ఫైర్ ఎక్సటింగుషర్స్ ఉపయోగించి అగ్ని ప్రమాదములు నివారించే పద్ధతులు వారికి పూర్తిగా అవగాహన కల్పించామని తెలిపారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ ఫైర్ ఆఫీసర్ మునాఫ్, ఫైర్ సిబ్బంది, బాపట్ల పబ్లిక్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రఘురామ్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## నూతన రథం పైభాగం పనులను పరిశీలించిన కోన



బాపట్ల టౌన్, మేజర్‌న్యూస్: ఇటీవల బాపట్ల శాసనసభ్యుడు వేగేశన నరేంద్ర వర్మ రాజు శ్రీ చీర బావన్నారాయన స్వామి దేవాలయం నూతన రథాన్ని తూర్పు సత్రం నుండి వేలాదిమంది భక్తులతో ప్రత్యేక పూజలు నిర్వహించి అంగరంగ వైభవంగా గుడి ఆవరణలోకి తరలించారు. రథం పై భాగం నిర్మాణాలు గుడి ఆవరణలో ఏర్పాటు చేస్తున్నారు. విదేశీ పర్యటన ముగించుకొని బాపట్లకు చేరుకున్న మాజీ ఎమ్మెల్యే బాపట్ల నియోజకవర్గ వైయస్సార్సీపీ సమన్వయకర్త రాష్ట్ర పార్టీ వ్యవహారాల కమిటీ సభ్యుడు కోన రఘుపతి రథం పైభాగ నిర్మాణ పనులను పరిశీలించారు. రథం పనులపై శిల్పి గణపతి ఆచారి దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ శ్రీనివాసమూర్తితో ఆయన చర్చించారు. ఈ సందర్భంలో సెల్ఫీ గణపతాచారి పదేపదే ఇదంతా తమరి కృషివల్లే జరిగిందని అనటం కొస మెరుపు, అనంతరం భావదేవుని సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట బాపట్ల పట్టణ అధ్యక్షులు కాగిత సుధీర్ బాబు, మండల అధ్యక్షుడు ఏడుకొండల రెడ్డి, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## కందుల కొనుగోలు కేంద్రం ప్రారంభం



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: పండించిన పంటకు కొనుగోలు కేంద్రాలు లేక పోవడంతో దళారులు తక్కువ ధరలకు అడుగుతున్నారని, ఆవిధంగా అమ్మితే నష్టం వస్తుందని కంది పండించిన రైతులు దర్శి నియోజకవర్గం టిడిపి ఇంచార్జ్ గొట్టిపాటి లక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఆమె స్పందించి మార్క్ ఫెడ్ అధికారుల తో మాట్లాడి మండలంలో రెండు కందుల కొనుగోలుకేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులతో మాట్లాడారు. పసుపుగల్లు, ఉమామహేశ్వర పురం గ్రామాలలో కందులు కొనుగోలు కేంద్రాలను మంజూరు చేయించారు. గురువారం ఉమహేశ్వరపురంలో కందుల కొనుగోలును అధికారులు చేపట్టారు. రైతులు సమస్యలు రైతు బిడ్డకే తెలుస్తాయని, మండలంలోని రైతులు గొట్టిపాటి లక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కాటూరి గురవయ్య, మీని గా సాంబయ్య, గంగినేని రామాంజనేయులు, మాజీ సర్పంచ్ వేముల శ్రీను, వెలిగండ్ల రమేష్, కంచుమాటి నాగేశ్వరరావు, సొసైటీ కార్యదర్శి శంకర్, రైతులు పాల్గొన్నారు.

# సమస్యలపై ధ్వజమెత్తిన ఎంపిటిసి సభ్యులు



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్: సమస్యలు పరిష్కారంలో వివిధ శాఖల అధికారులు అలసత్వం వహిస్తున్నారని వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, జడ్పిటిసి ఏ ఏడుకొండలు, గొట్లగట్టు, వద్దిమడుగు ఎంపీటీసీలు ఉడుముల రామనారాయణరెడ్డి, చక్కెర వెలుగొండయ్యలు ధ్వజ మెత్తారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశం హాలులో ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సాగర్ నీటి సరఫరా పలు గ్రామాలకు సక్రమంగా రావడంలేదని, సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లోపించింది అని వైస్ ఎంపీపీ మెట్టు ఆందోళన వ్యక్తం చేశారు. వెలిగండ్ల మునగపాడు గ్రామాలకు సాగర్ నీరు సరఫరా కావడం లేదని సర్పంచులు పాతకోట వెంకటరెడ్డి సిద్ధాభి నబీలు అన్నారు. రోడ్డు పనులు చేసే సమయంలో పైపులైను దెబ్బ తినటంతో పాటు వాల్స్ పగిలిపోయాయని ఏ ఈ సమాధానం చెప్పారు. త్వరలో వాల్స్ మరమ్మత్తులు చేసి నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ పనులలో అవకతవకలు చోటుచేసుకున్నాయని, దూరప్రాంతాల్లో ఉన్నవారికి పనులకు రాకుండానే ఎఫ్ఏలు మస్టర్లు వేస్తున్నారని వైస్ ఎంపీపీ మెట్టు ఆరోపించారు. ఒక్కొక్క మస్టర్కు వారానికి వంద రూపాయలు చొప్పున వసూలు చేస్తున్నారన్నారు. పనులకు రాని వారికి మస్టర్లు వేసే ఫీల్డ్ అసిస్టెంట్లు పై చర్యలు తీసుకుంటామని ఏపీవో అన్నారు. తీర్మానాలు లేకుండా ఉపాధి పనులు మంజూరు చేయడంపై గొట్లగట్టు ఎంపిటిసి రామనారాయణరెడ్డి అభ్యంతరం తెలిపారు. గ్రామాల్లో బెల్ట్ షాపు నడుస్తున్నాయని అన్నారు. వద్దిమడుగు పాఠశాలలో నాడు నేడు కింద మంజూరైన పనులు అర్ధంతరాగా నిలిచిపోయాయని, నిధులు అయితే ఖర్చు చేశారని ఎంపీటీసీ వెలుగొండయ్య ఆరోపించారు. నిధులు మంజూరు కావలసి ఉందని ఎంఈఓ ఎస్ కే దాంగే షరీఫ్ సమాధానం చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఏవో కే ప్రసన్న రంగలక్ష్మి, ఫారెస్ట్ రేంజర్, పి ఆర్ ఏ ఈ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈలు బాలు నాయక్, కొనకనమిట్ల, గొట్లగట్టు వైద్యాధికారులు సురేఖ, నరేంద్ర ఆయా శాఖల పనితీరుపై సమీక్షించారు.

## ప్రజల భద్రత, నేర నియంత్రణ మా బాధ్యత

### ఎవరైనా నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం

### వాహన ఆకస్మిక తనిఖీల్లో జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్




మార్కాపురం, మేజర్‌న్యూస్:ఎవరైనా నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని 28 ప్రదేశాలలో ప్రకాశం జిల్లాకు చెందిన 155 మంది పోలీసు అధికారులు, 600 సిబ్బందితో కలసి, ప్రత్యేక పోలీస్ బలగాలు స్పెషల్ పార్టీ, స్వాట్ టీం, 30 డ్రోన్ కెమెరాలు, డాగ్ స్క్వాడ్ బృందాలు విస్తృతమైన తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రత్యేక తనిఖీల్లో భాగంగా పట్టణంలోని ముఖ్యమైన కూడళ్లలో, రహదారులపై వాహనాలు, పలు ఇళ్లల్లో, శివారు ప్రాంతాల్లో, పాత నేరస్తుల ఇళ్లలలో, చెడు నడతకలిగిన వారు, గంజాయి అక్రమ రవాణా, క్రికెట్ బెట్టింగ్ యాప్స్, కిరాణా షాప్‌లలో, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తులను విచారించారు.ఈ తనిఖీలో ప్రధాన ప్రదేశలలో వాహన తనిఖీలు చేసి సరైన రికార్డు, డ్రైవింగ్ లైసెన్స్ లేని మోటార్ సైకిళ్లు మరియు ఇతర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా ప్రజల భద్రతను కల్పించుటకు ఈ తనిఖీలు నిర్వహించడం జరిగిందని, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించడమే ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ తనిఖీల్లో ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరుతున్నామన్నారు. ప్రజల భద్రత, నేర నియంత్రణ దృష్ట్యా ఈ తనిఖీలు నిర్వహించామని, చట్ట వ్యతిరేక పనులకు, దొంగతనాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తుల సంచారం పట్ల అప్రమత్తంగా ఉండాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై ఏదైనా సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా డయల్ 100/112 తెలియజేయాలని అక్కడి ప్రజలను కోరారు. ఈ నేర సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్పీ అశోక్ బాబు, డిఎస్పీలు శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, సాయి ఈశ్వర్ యశ్వంత్, నాగరాజు, రమణ కుమార్, శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర,సీఐలు సుబ్బారావు, బీమా నాయక్, శ్రీకాంత్ బాబు, మల్లికార్జున, రామకోటయ్య, సురేష్, ప్రభాకర్, నాగరాజు, రామారావు, సోమశేఖర్, శ్రీనివాసరావు, అజయ్ కుమార్, హాజరత్తయ్య, ఖాజావలి, మార్కాపురం సిఐ సుబ్బారావుతో పాటు సిఐలు, ఎస్సైలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలి

కనిగిరి, మేజర్‌న్యూస్: మండలంలోని కంచర్లవారిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ పక్వాడ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎం.వి.ఎస్.పార్వతి ఆధ్వర్యంలో పాఠశాల కిషోర్ బాలికల ఆరోగ్య సదస్సును నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు శక్తిని, పెరుగుదలను, రక్షణను ఇచ్చే పోషక పదార్థాలైన చిరుధాన్యాలు, నూనెలు, పాలు, మాంసం, గుడ్లు, ఆకుకూరలు,పండ్లు, కూరగాయలు కలిగిన సమతుల ఆహారం తీసుకోవాలన్నారు. శారీరక మానసిక, సామాజిక ఆరోగ్యం, రుతుక్రమం, వ్యక్తిగత పరిశుభ్రత, వ్యాయామం, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు గురించి అవగాహన కల్పించారు. గురువాజిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఎన్.తులసీదాస్ మాట్లాడుతూ బాలికలలో ఎక్కువ మంది రక్తహీనత(ఎనీమియా)కు గురవుతున్నారని దాని లక్షణాలు, కారణాలు, నివారణ చర్యలను తెలియజేశారు. ఆరోగ్య సిబ్బందితో బాలికలకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సి.విజయభాస్కర్ రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ కుమారి,హెల్త్ సూపర్వైజర్ పి.నాగమునెమ్మ, ఏఎన్ఎం వి.మేరమ్మ, ఎమ్ఎల్‌హెచ్‌పి వై.కవిత, ఆశవర్కర్ వి.సుజాత, మహిళా పోలీస్ బి.శాంతకుమారి, అంగన్వాడీకార్యకర్తలు పి.కళ్యాణి, శైలజ, రమణమ్మ పాఠశాలబాలికలు పాల్గొన్నారు.

## కిషోర్ బాలికలకు హెల్త్ ఎడ్యుకేషన్

చీమకుర్తి, మేజర్‌న్యూస్: చీమకుర్తి మండలం లోని చీమకుర్తి సెక్టార్లు కొత్త కుమ్మరిపాలెం సచివాలయం బంగారం తోపు సచివాలయం రామ తీర్థం సెక్టార్ లోని నిప్పట్లపాడు సచివాలయం పల్లమల్లి సచివాలయంలో కిషోర్ బాలికలకు హెల్త్ ఎడ్యుకేషన్ ఎనీమియా హిమోగ్లోబిన్ హెల్త్ గురించి వివరించారు. కిషోర్ బాలికల లు మంచి ఆహారం తీసుకోవాలి బాల్యవాహ లు చేసుకోకుండా, చదువును కొనసాగించాలి.వృత్తివిద్య శిక్షణ నేర్చుకోవాలి మారుతున్న టెక్నాలజీ ప్రకారం మంచిగా ఉపయోగించుకొని జీవితంలో చక్కగా ఎదగడానికి వారి కలలను సహకారం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్స్ కె.దేవసేన, ఆర్.పిచ్చమ్మ, ప్రమీల కిషోర్ బాలికలు తల్లులు అంగన్వాడి వర్కర్లు అంగన్వాడి ఆయాలు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఒంగోలు కమిటీ ఏకగ్రీవం

### నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా వెంకటేశ్వర్లు, కృష్ణారావు



ఒంగోలు, మేజర్‌న్యూస్ : జిల్లా గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ఒంగోలు నూతన కమిటీ ఏకగ్రీవం అయ్యింది. గురువారం ఒంగోలులోని పద్మావతి ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం జిల్లా కమిటీ వారి సమక్షంలో పట్టణ కమిటీ ఏర్పాటు చేశారు. నూతన ఒంగోలు అధ్యక్షునిగా పెళ్లూరు వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పెండెం వెంకట కృష్ణారావు, కోశాధికారీగా జానా శ్రీనివాసుని ఎన్నుకున్నారు. ఒంగోలు మండల ఏరియా నుండి 60 మందిపైగా సభ్యులు హాజరైన్నారు. జిల్లా కమిటీ నుండి కార్యదర్శి పి. చంద్రశేఖర్, అధ్యక్షులు బట్టు బాలాజీ, ఉపాధ్యక్షులు డి. సింగయ్య, ఉపాధ్యక్షులు ఎస్‌కె ఇమాంసా, గౌరవ అధ్యక్షులు భాస్కర్‌రావు, ఆర్గనైజయింగ్ కార్యకదర్శి నాగరాజు ఎన్నికల సభ్యులుగా ఉన్నారు. సభ్యులందరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలియజేశారు.

## ఆటోను ఢీకొన్న లారీ: తప్పిన ముప్పు

చీరాల రూరల్, మేజర్‌న్యూస్: చీరాల రూరల్ – ఒంగోలు జాతీయ రహదారి పై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. హాయ్ రెస్టారెంట్ సమీపంలో ఆగివున్న ఆటోను వెనుక నుంచి లోడుతో వెళ్తున్న ఓ లారీ ఢీ కొని బోల్తా పడింది. ఆటో కాలువలోకి వెళ్లడంతో అందులో ఉన్న ప్రయాణికులకు ఎటువంటి ప్రమాదం జరగక పోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకొని ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు.

## శ్రీ షిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజలు



ముండ్లమూరు, మేజర్‌న్యూస్: మండల కేంద్రమైన ముండ్లమూరులోని శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో గురువారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూడు గ్రామానికి చెందిన బేతపూడి రామారావు, మల్లేశ్వరి దంపతులు శ్రీ శిరిడి సాయిబాబాకు అభిషేకం, ప్రత్యేక పూజలు చేసి స్వామివారి ఆశీర్వాదం తీసుకున్నారు. ముండ్లమూరు పసుపుగల్లు, నాయుడుపాలెం, పోలవరం, పులిపాడు గ్రామాల్లోని శ్రీ శిరిడి సాయిబాబా ఆలయాల్లో బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా మందిరానికి ముండ్లమూరు, వేంపాడు, పెద్ద రావిపాడు, చంద్రగిరి, సింగన్నపాలెం గ్రామాల నుండి భక్తులు విచ్చేసి బాబాకు ప్రత్యేక పూజలు చేసి ఉదయం హారతి, మధ్యాహ్నం 12 గంటల హారతి కార్యక్రమాల్లో పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా బేతపూడి రామారావు మల్లేశ్వరి దంపతులు 400 మంది భక్తులకు అన్న సంతర్పణ చేశారు.

## కరోనా వైరస్ కంటే వైకాపా ప్రమాదం: డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ




దర్శి, మేజర్‌న్యూస్: తిరుమలలో గోవుల మృతిని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని ప్రయత్నించిన నీచపు పార్టీ వైసీపీ అని దర్శి నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ రోజు రోజుకి సమాజంలో కరోనా వైరస్ మాదిరిగా మారిపోయిందని, ప్రతి రోజు ఏదో అసత్య ప్రచారాలు చేసి ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నదని డాక్టర్ లక్ష్మీ ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసిపి హయాంలో ఈవో జవహర్ రెడ్డి, అదనపు ఈవో ధర్మారెడ్డి మధ్య జరిగిన ఆధిపత్య పోరుతో గోశాల నిర్వహణను గాలికొదిలేశారని డాక్టర్ లక్ష్మీ విమర్శించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టకు భంగం కలిగించాలని ప్రయత్నించిన వారెవరైనా, దేవదేవుడి ఆగ్రహానికి గురికాక తప్పదని ఆమె అన్నారు.

## కనిగిరి అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై అవగాహన



కొనకనమిట్ల, మేజర్‌న్యూస్: జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మండలంలోని పెదారికట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయులు,సిబ్బంది విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవలసిన జాగ్రత్తలు, మరియు జరిగినపుడు తీసుకోవలసిన నివారణ చర్యలు గురించి గురువారం కనిగిరి అగ్నిమాపక కేంద్ర అధికారి, సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. ప్రమాదాలు జరిగినపుడు ఏఏ పద్ధత్తుల ద్వారా ప్రజలను కాపాడాలి, వాటి నివారణ చర్యలు గురించి డెమో కార్యక్రమం నిర్వహించి కరపత్రాలను పంపిణీ చేశారు. గ్యాస్,ఎలక్ట్రికల్, అయిల్, అగ్నిప్రమాదాలు గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్దారికట్ల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. నరసింహారావు, ఉపాధ్యాయులు సిబ్బంది, అగ్నిమాపక అధికారి సిహెచ్.బంగారుబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ న్యాయవాదిని సన్మానించిన గునుపూడి



పొదిలి, మేజర్‌న్యూస్: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ న్యాయవాదిగా బాధ్యతలు చేపట్టిన షేక్ షబ్బీర్ ను గురువారం టిడిపి రాష్ట్ర కార్యదర్శి గునుపూడి భాస్కర్, శివాలయం చైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, నాయకులు దివ్వల మురళి, సామి రాజా తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు కప్పి, బొకే అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం స్వీట్లు తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రముఖ న్యాయవాది షేక్ షబ్బీర్ ను ప్రభుత్వ న్యాయవాదిగా నియమించడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు.